
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 05.12.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



విభజనతో ఏపి ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యింది. ఆదాయం తెలంగాణకు పోగా అప్పులు ఆంధ్రాకు మిగిలాయి. విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ పరుగు 'జీరో' నుండి మొదలుపెట్టాల్సి వచ్చింది. ఆంధ్రులకు ఇది అలవాటే! ఎక్కడకు వెళ్లయినా కష్టించి పనిచేసి అభివృద్ధి చెందే అలవాటు ఆంధ్రులకు ఉంది. కాబట్టి 'సున్నా' నుండి పరుగును మొదలుపెట్టినా చాలా వేగంగా అభివృద్ధి చెందగలం. గత చరిత్ర నుండి చూస్తే రాజధాని పరంగా ఆంధ్రులు ఎన్నోసార్లు నష్టపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా మద్రాసు రూపంలో ఒకసారి, కర్నూలు రూపంలో మరోసారి, హైదరాబాద్ పరంగా ఈసారి నష్టపోయాం.

# హామీలన్నీ మాఫీ!

## • రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం • ఆదాయం తక్కువ... వ్యయమెక్కువ

***రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధికార పగ్గాలు చంద్రబాబు చేపట్టాడు. అనుభవజ్ఞుడు కదా.. చిద్రమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆయనైతేనే గాడిలో పెట్టగలడని చాలామంది భావించి ఓట్లేసారు! కాని ఆయన సిఎం అయితే జరుగుతుందని ఊహించింది ఒకటైతే, ఇక్కడ ఆచరణలో జరుగుతున్నది ఇంకోటి!***

ఎన్నికల్లో అధికారం కోసం ఆయన చేసిన ఋణమాఫీ వాగ్దానం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడమే కాదు ఆర్థిక లావాదేవీలను సైతం స్థంభింపజేస్తోంది. రాష్ట్రంలో అన్ని రకాల ఋణాలు కలిపి 83వేల కోట్లున్నాయి. వీటికి వడ్డీలు కలిపితే లక్షకోట్లకు పైమాటే! ఎన్నికలప్పుడు మాత్రం అన్ని రకాల ఋణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు డాబుగా చెప్పారు. అధికారంలోకి వచ్చాక చూస్తే ఋణమాఫీ అలవికాని అనకొండ మాదిరిగా కనిపించింది. ఓ పక్క రైతులను, డ్వాక్రా మహిళలను ఋణాలు కట్టవద్దంటూనే ఇంకోపక్క ఋణమాఫీకి ఆంక్షలు పెట్టసాగారు. ఋణమాఫీ హామీతో ఋణగ్రహీతలు బ్యాంకులకు అప్పులు కట్టడం మానుకున్నారు. రైతులు కట్టని అప్పులను బ్యాంకులకు ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో ఇచ్చిన అప్పులు తిరిగి రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకులలో ఆర్థిక

(మిగతా 10వ పేజీలో)

గత ఎన్నికల్లో వైకాపా అధినేత జగన్ అనుకున్నదొకటైతే అయ్యిందొకటి! తన సభలకు వస్తున్న జనాన్ని చూసి అధికారం చేతి కొచ్చినట్లేననుకు న్నాడు. కానీ ఎన్నికల ఫలితాలు చూసాక సభలకు వచ్చే జనాన్ని బట్టి గెలుపోట ములనంచనా వేయకూడదని గ్రహించాడు.



# జగన్ అలర్ట్

## • కేడర్ జారిపోకుండా జాగ్రత్త

***జగన్ తన తండ్రి మరణం తర్వాత నాలుగేళ్లు కష్టపడ్డాడు. ప్రతిక్షణం జనం మధ్యలో తిరిగాడు. కానీ చివరి నాలుగు నెలల్లో ఎలక్షన్‌ను చేయాల్సిన తీరులో చేయలేదు. అదే చంద్రబాబు ఎన్నికలకు ముందు నాలుగున్నరేళ్లు నా బ్రతుకేంటి, నా భవిష్యత్ ఏంటని మధనపడ్డాడు. తనకిక రాజకీయ భవిష్యత్ లేదనుకున్నాడు. కానీ చివరి నాలుగు నెలలు ఎలక్షన్ చేశాడు. పార్టీని అధికారంలోకి తెచ్చాడు. రాజకీయాలలో అనుభవానికి అనుభవలేమికి ఉన్న తేడా ఇక్కడే కనిపిస్తుంది.***

జగన్ చేజేతులా అధికారాన్ని కోల్పోయాడు. ఇప్పుడు పార్టీ కేడర్‌ను కూడా కోల్పోయే పరిస్థితి వచ్చింది. మొన్న ఎన్నికల్లో వైకాపా తరపున పోటీ చేసిన వాళ్లు గానీ, పార్టీ కోసం పనిచేసిన వాళ్లు గానీ ఆర్థికంగా బాగా నష్టపోయారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక వైకాపాలో ఆర్థికంగా వున్న బలవంతులను లాక్కునే ప్రయత్నం జరుగుతోంది. ఈ ఒత్తిడి తట్టుకోలేక వైకాపా నుండి తెలుగుదేశంలోకి కొందరు మారుతున్నారు. పార్టీ మీద అభిమానంతో కొందరు జగన్ వెంటే వున్నా, ఆర్థికంగా వారికి ఆసరా లభించడం లేదు. ఈ నేపథ్యంలో వైకాపాలో వున్న చాలామంది నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారు. తాను అలర్ట్ కాకపోతే

(మిగతా 10వ పేజీలో)

## కృష్ణపట్నంపోర్టు సెజ్‌కు భారీగా పెట్టుబడులు



# సింహపురికి 'జపాన్' సిరులు

***'అదృష్టవంతుడిని ఎవరూ చెరపలేరు. దురదృష్టవంతుడిని ఎవరూ బాగు చేయలేరు' అని 'లాయర్' గతంలోనే చెప్పింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి విషయంలో నెల్లూరుజిల్లాను చిన్నచూపు చూసారు. దీనికి కారణం గత ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి తక్కువ సీట్లు రావడమే. కేంద్రం మంజూరు చేసిన జాతీయ వైద్య, విద్య సంస్థలలో ఒక్కదానిని కూడా ఆయన నెల్లూరు జిల్లాకు మంజూరు చేయలేదు. అంతేకాదు, నెల్లూరుజిల్లాకు ఏదీ అడగొద్దని, తమ పార్టీకి ఓట్లేయనందుకు నెల్లూరోళ్లకు సిగ్గురావాలని జిల్లా తెలుగుదేశం నాయకుల ముఖాన గుద్దినట్లే చెప్పాడు. ఆ సందర్భంలోనే 'లాయర్' పై వ్యాఖ్యానం చేసింది. చంద్రబాబు ఎంత కసిపెంచుకున్నా నెల్లూరు జిల్లా అభివృద్ధిని తాత్కాలికంగా ఆపగలిగాడేగాని శాశ్వతంగా ఆపలేదు. ఎందుకంటే సీమాంధ్రలోని 13జిల్లాలలో బయట ప్రాంతాల వారు పెట్టుబడులు పెట్టడానికి, నివాసం ఉండడానికి మొదటగా ఇష్టపడేది నెల్లూరుజిల్లానే! దానికి అనువైన వాతావరణమే కాదు, అందుకు తగ్గ వసతులు కూడా ఉన్నాయిక్కడ!***

ముఖ్యమంత్రి చంద్రబాబు మందీమార్భలంతో జపాన్ పర్యటనకు వెళ్లొచ్చారు. ఆయనతో పాటు మన జిల్లాకు చెందిన మంత్రి పి.నారాయణ, శ్రీసిటీ ఛైర్మెన్ రవి సన్నారెడ్డిలు కూడా ఉండడం విశేషం. చంద్రబాబు బృందం జపాన్ పర్యటన ఫలితం నెల్లూరుజిల్లాకే ఎక్కువగా ఉండబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే దేశంలోనే సక్సెస్‌ఫుల్ సెజ్‌గా పేరుబడ్డ 'శ్రీసిటి'లో

(మిగతా 10వ పేజీలో)

# బాధ్యతలకు శ్రీకారం

(వివరాలు 7వ పేజీలో)



ఈ నెల 1న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న ఎం.జానకి

# వెంకటగిరిని అభివృద్ధి పథంలో తీసుకొస్తా



నెల్లూరుజిల్లా వెంకటగిరి మునిసిపాలిటీని అభివృద్ధిపథంలో తీసుకొస్తానని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం వెంకటగిరి – మన్నవరంకు వెళ్లే మార్గంలోని రాజు పాళెం వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 1.80కోట్లు మంజూరయ్యాయని, అందుకోసం సర్వేను ఆర్ అండ్ బి వారు నిర్వహిస్తున్నారన్నారు. త్వరలో టెండర్లు పిలిచి బ్రిడ్జి నిర్మాణాలతో పాటు పరిశ్రమల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ బీరం రాజేశ్వరరావు, ఆర్ అండ్ బి ఏఇ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### జపాన్, సింగపూర్ టెక్నాలజీతో

## రాజధాని నిర్మాణం



జపాన్, సింగపూర్ టెక్నాలజీతో ఆంధ్రరాష్ట్ర రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారని నెల్లూరు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరుజిల్లా నాయుడుపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాశ్చాత్యదేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భారతదేశంలో కొత్తతరహా రాజధానిని నవ్యాంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్మించబోతున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు, సిఎం చంద్రబాబునాయుడు, జిల్లా మంత్రి పొంగూరు నారాయణ సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలికి మాధవ్‌రెడ్డి, వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాగుంటకు నివాళులు

నెల్లూరుజిల్లా కావలి యం.యస్.ఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 19వ వర్ధంతి, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ సొసైటి ఏరియా ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో 116మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి డిఎస్‌పి డి.మోహన్‌రావు పాల్గొని మాట్లాడుతూ విద్యాదానం, అన్నదానం కన్నా రక్తదానం చాలాగొప్పదని పేర్కొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ వేళలు మార్పు

జిల్లాలో వ్యవసాయ విద్యుత్ పంపిణీ చేస్తున్న వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ నెల్లూరు సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగశయనారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటివరకు వున్న నాలుగు గ్రూపులను మూడు గ్రూపులను చేశామన్నారు. ఆ మేరకు, ఏ-గ్రూప్‌కు ఉదయం 6 నుంచి 19 గంటల దాకా, మళ్ళీ రాత్రి 10 నుంచి అర్ధరాత్రి ఒంటిగంట దాకా విద్యుత్ పంపిణీ వుంటుందని తెలిపారు. అదేవిధంగా, బి-గ్రూప్‌కు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మళ్ళీ రాత్రి ఒంటిగంట నుంచి వేకువన 4 గంటల వరకు విద్యుత్ పంపిణీ వుంటుందన్నారు. సి-గ్రూప్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల దాకా, మళ్ళీ వేకువన 3 నుంచి ఉదయం 6 గంటల దాకా విద్యుత్ పంపిణీ వుంటుందని, ఈ గ్రూప్‌లకు విద్యుత్ సరఫరా ప్రతివారం గతంలోవలె మారుతూ వుంటుందని పేర్కొన్నారు.

## వృద్ధ కళాకారులు లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించాలి

నెల్లూరుజిల్లాలో కళాకారుల వృద్ధాప్యపింఛను పొందుతున్న వృద్ధ కళాకారులు లైఫ్ సర్టిఫికేట్లు(బ్రతికి వున్నట్లు ధృవీకరణపత్రం) ఆధార్‌కార్డ్ జెరాక్స్ కాపి, వ్యక్తిగత బ్యాంకు ఖాతా నెంబరు జెరాక్స్ కాపి, ఫోన్ నెంబర్ వివరాలను ఈ నెల 31వ తేదీలోగా వ్యక్తిగతంగా వచ్చి నెల్లూరు జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని డిపిఆర్‌ఓ జి.మనోరంజన్ తెలిపారు.

## డక్కిలిలో డెంగీ

నెల్లూరుజిల్లా డక్కిలి మండల పంచాయితీలోని నరసనాయుడిపల్లిలో డెంగీ వ్యాధికి గురై దళితవాడకు చెందిన మచ్చల అశోక్ తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న వైద్యులు ఆదివారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి రక్తనమూనాలను సేకరించారు. వైద్యాధికారి సుధీర్‌బాబు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బాధితులకు వ్యాధి నివారణ మందులు పంపిణీ చేశారు. డెంగీ తదితర వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు ఇళ్ల ముందు మురుగులో కిరోసిన్ చల్లితే మంచిదని వైద్యులు సూచించారు.

# అక్రమ రవాణాకు బ్రేకులు

### - రాష్ట్ర వాణిజ్యపన్నుల ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్త కార్యదర్శి

అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వా దాయాన్ని పెంచేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వాణిజ్యపన్నుల ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్త కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల ఆయన జిల్లా వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధి కారులతో కలిసి, తడ మండలంలో వున్న భీములవారిపాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ స్కానర్లు ఏర్పాటు చేసేందుకు తగు పరిశీలనలను జరిపారు. చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారిపై స్కానర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలించారు. వాహనాల్లో పన్నులు ఎక్కువగా వచ్చే సరుకులను వేసుకుని రవాణా చేస్తూ, తక్కువగా వుండే వస్తువుల పేర్లతో బిల్లులు చూపించి కొంతమంది అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఇలా పన్నులు ఎగవేసి అక్రమరవాణా చేస్తుం డడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాబడి తగ్గిపోతోందని ఆయన అంటూ, ఉమ్మడి తనిఖీ కేంద్రం ఆధునీకరణ జరిగేలోపే స్కానర్లు ఏర్పాటు చేసి, అక్రమ రవాణాను అరికడతామని అన్నారు. పన్ను ఎగవేత దారుల ఆట కట్టించడానికి స్కానర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్కానర్లు ఏర్పాటు చేస్తే, లారీల్లో ఏ సరుకు రవాణా అవుతుందో తెలుస్తుందని, దాన్నిబట్టి పన్నులు విధించవచ్చని అన్నారు. అక్ర మాలను అరికట్టేందుకు, ప్రభుత్వాదా యాన్ని పెంచేందుకు సిబ్బంది అంతా సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల డిప్యూటి కమిషనర్ రాజశేఖర్, గూడూరు సిటిఓ లక్ష్మీమాధవి, చెక్‌పోస్ట్ డిసిటిఓ మల్లికార్జున, ఏ.ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

### ఉదయగిరి నుండి

## పెంచలకోనకు బస్సు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును నెల్లూరుజిల్లా మర్రిపాడు మీదుగా ఏర్పాటు చేయడంపై మర్రిపాడు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు ఏర్పా టుకు ఇటీవల సిపిఎం నేతలు ఉదయగిరి డిపో మేనేజర్, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డిని కలిసి విన్నవించు కున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకొని డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు ఏర్పాటు చేసేలా కృషి చేయడంపై సిపిఎం నేతలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధిహామీలో అక్రమాలు

జాతీయ ఉపాధిహామీ పథకంలో అక్రమాలు భారీగా జరుగుతున్నాయని, అక్రమాలను అరికట్టి కూలీలకు కనీసం రూ. 100లు కూలీ గిట్టుబాటయ్యేలా చూడాలని అధికారులకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య సూచించారు. ఆదివారం తడ ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమా వేశంలో సంజీవయ్య మాట్లాడుతూ పనులను జెసిబితో చేయిస్తూ కూలీల కడుపు కొడుతున్నారని, రోజంతా పని చేసినా కనీస కూలీ గిట్టుబాటు కావడం లేదని భీములవారిపాళెం ఎంపిటిసి సభ్యుడు మనోహర్ సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బొమ్మన శ్రీధర్, ఎంపిపి చెంగేరి సెల్వి, ఉపాధ్యక్షుడు కుదిరి రామకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు బి.వేణుగోపాల్, తహశీల్దార్ ఏడుకొండలు ఎంపిడిఓ రమణయ్య పాల్గొన్నారు.

## లారీ ఆచూకీ దొరికింది

రాష్ట్ర సరిహద్దులోని రామాపురం వద్ద గత నెల 25వ తేదీ రాత్రి హైజాక్ అయిన ఇనుపపైపుల లారీ ఆచూకీ దొరికింది. ఆ లారీ చిత్తూరుజిల్లా వడమాలపేట సమీపంలో కనిపించగా అందులోని పైపులు మాత్రం గల్లంతయ్యాయి. ఈ పైపులను సమీపప్రాంతాల్లో విక్రయించి నట్లు అనుమానిస్తున్నారు. ఈ లారీని హైజాక్ చేసిన సమయంలో అందులోని సిబ్బందిని కిడ్నాప్‌చేసి మూడురోజుల తర్వాత సత్యవేడు పరిసరప్రాంతాల్లో వదిలిపెట్టారు. ఈ కేసును తడ ఎస్సై ఈశ్వర్‌రెడ్డి, సుళ్ళూరుపేట సిఐ రత్తయ్య, ఎస్సై గంగాధర్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

### శంకర్ హత్యపై...

## కావలి విలేకరుల నిరసన



గుంటూరుజిల్లా చిలకలూరిపేటలో ఆంధ్రప్రభ విలేకరి ఎం.వి.ఎన్.శంకర్ హత్యకు నిరసనగా కావలిలోని పాత్రికేయులు తమ నిరసన వ్యక్తం చేశారు. కావలి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద పాత్రికేయులపై జరుగుతున్న దాడులను ఖండించారు. సీనియర్ పాత్రికేయులు ఆంధ్రప్రభ జర్నలిస్ట్ సిద్ధిరెడ్డి జయప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆర్‌డిఓ లక్ష్మీనరసింహంకు వినతిపత్రం సమర్పించి దోషులను శిక్షించాలని, పాత్రికేయుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేకచట్టాలు అమలు చేయాలని కోరారు.

## 'ఉపాధి' అక్రమాలపై కొరడా

ఉపాధి అక్రమాలపై అధికారులు కొరడా విసురుతున్నారు. ఇటీవల సైదాపురం మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లోనూ, పింఛన్ల పంపిణీలోనూ దాదాపు 11లక్షల రూపాయల దాకా అవినీతి జరిగినట్లు సంబంధిత విచారణాధికారి డ్వామా ఎపిడి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 3.5 కోట్ల రూపాయల వ్యయమయ్యే ఉపాధి పనులు జరిగితే, అందులో 11 లక్షల రూపాయల దాకా అవినీతి అక్రమాలు జరిగినట్లు విచారణాధికారి ప్రాథమికంగా తేల్చారు. ఈ అక్రమాలకు బాధ్యులైన చీకవోలు, పోతేగుంట, ఎస్ఆర్‌వైజి పాళెం, కొమ్మిపాడు, మర్లపూడి, లింగసముద్రం క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశారు. వారి నుంచి 11 లక్షల రూపాయలను రికవరీ చేయాలని నిర్ణయించామని విచారణాధికారి రవికుమార్ పేర్కొన్నారు.

### మోడీ వాగ్దానాలు

## కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయి

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వాగ్దానాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ, సామాన్య కార్మికుల పొట్ట కొడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు విమర్శించారు. ఆదివారం రాత్రి నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో కళాకారుల తప్పెట్లు, విప్లవ గేయాలతో సిపిఎం పార్టీ 50వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్న స్మార్ట్‌సిటీలు, విమానాశ్రయాలు సామాన్య జనం కడుపు నింపవని, బడా కంపెనీలకు కొమ్ము కాస్తున్నారే తప్ప పేదకార్మిక, కష్టజీవుల కోసం మీరేం చేస్తున్నారంటూ నిలదీశారు. ముందుగా ఈ సభను సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్ ప్రారంభించగా నెల్లూరునగర కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షత వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య, మోహన్‌రావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్‌లో పోలీసులు

నెల్లూరు గ్రామీణ పోలీసులు శనివారం ఎంతో ఉత్సాహంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అందరూ చీపుర్లు చేతబట్టి స్టేషన్‌ను పరిశుభ్రం చేశారు. బూజును దులిపి, అంతా శుభ్రం చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని చెత్తాచెదారాన్నంతా తొలగించి పరిశుభ్రం చేశారు. జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ గిరిబాబు పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

## ఎక్స్‌పర్ట్ కమిటీలో...

# నెల్లూరీయుడు.. రావి సుధాకర్‌చౌదరి

రాష్ట్రంలో చెరుకు పరిశ్రమలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం 5మంది సభ్యులతో ఎక్స్‌పర్ట్ కమిటీని వేసింది. ఆ కమిటీలో నెల్లూరీయుడు, టిపిగూడూరు మండలం ఈదూరు వాసి రావి సుధాకర్‌చౌదరికి స్థానం కల్పించడం విశేషం.

ఈయన తూర్పుగోదావరి జిల్లా చెల్లూరులోని సర్వారాయ షుగర్స్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్నారు. షుగర్ పరిశ్రమలకు సంబంధించి దాదాపు 40ఏళ్ల అనుభవం, ఆ పరిశ్రమతో అంతటి అనుబంధం వుంది. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో వున్న చక్కెర కర్మాగారాలు నష్టాల్లో నడుస్తూ మూత పడే పరిస్థితి రావడం, ప్రైవేట్ రంగంలో వున్న పరిశ్రమలు లాభాల్లో వుండడం చూస్తున్నాం. ప్రభుత్వరంగంలోనే నష్టాలెందుకొస్తున్నాయనేదానిపై అధ్యయానికి ప్రభుత్వం ఆయా రంగాలలోని నిపుణులతో కమిటీని వేయగా, షుగర్‌లోనే పుట్టి, షుగర్‌నే జీవితంగా మలచుకున్న సుధాకర్‌చౌదరి అనుభవాన్ని వాడుకోదలచి ఆ కమిటీలో సభ్యునిగా నియమించింది. ఈదూరు గ్రామానికి చెందిన సుధాకర్‌చౌదరి వ్యవసాయశాస్త్రంలో ముఖ్యంగా చక్కెర పరిశ్రమకు సంబంధించిన విద్యలో కోయంబత్తూరు యూనివర్శిటీ నుండి పట్టా పొందారు. 1968లో అగ్రికల్చరల్ ఇన్స్‌పెక్టర్‌గా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించి వివిధ హోదాలలో పనిచేశారు. 1986–1990ల మధ్య సంధ్యాల కో–ఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్‌కు, ది చోడవరం కో–ఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్, గోవాడకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసి వాటి పురోభివృద్ధికి పాటుపడ్డారు. 1990 నుండి 2008వరకు తూర్పు గోదావరి జిల్లా చెల్లూరులోని శ్రీ సర్వారాయ షుగర్స్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా 2008 జూన్1 నుండి అదే ఫ్యాక్టరీకి వైస్‌ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్నారు.

చక్కెర పరిశ్రమలో ఆయన చేసిన కృషికి, ప్రయోగాలకుగాను రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు, పురస్కారాలు లభించాయి. చక్కెర పరిశ్రమలో ఆయన విశేష అనుభవాన్ని రాష్ట్రంలో షుగర్ పరిశ్రమ అభివృద్ధికి వినియోగించుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఇప్పుడు గౌరవప్రదమైన స్థానం కల్పించింది. సుధాకర్‌చౌదరికి 'లాయర్' అభినందనలు.



## కలెక్టర్‌కు జడ్పీ ఛైర్మెన్ అభినందనలు

నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకిని జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈనెల 6వతేదీ నెల్లూరుజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్‌ను ఆహ్వానించారు. జడ్పీ ఛైర్మెన్‌తో పాటు జడ్పీసిఇఓ జితేంద్ర పాల్గొన్నారు.

# పక్షుల పండుగను వేడుకగా చేద్దాం



జనవరి 2, 3, 4వతేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ పెద్దఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.జానకి వెల్లడించారు. ఆమె బుధవారం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫ్లెమింగో ఫెస్టివల్ గురించి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో మరియు స్వచ్ఛంధ సంస్థల వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఒక పండుగ వాతావరణంలో జరిపించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలను కనుగొనడానికి సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు.

సూళ్లూరుపేట శాసనసభ్యులు కలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పులికాట్ ప్రాంతాన్ని టూరిస్ట్‌హబ్‌గా రూపొందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధసేవాసంస్థల వారు ఇచ్చిన సూచనలను మరియు సలహాలను క్రోడీకరించి అధికారులు ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతమయ్యేలా చూడాలన్నారు. బి.వి.పాలెంలో టూరిస్ట్‌లకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో పర్యాటకశాఖ అభివృద్ధి అయితే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పులికాట్ సరస్సుకు ఆంధ్ర మరియు తమిళనాడు సరిహద్దులుగా వున్నందున ఇరురాష్ట్రాల జాలర్ల మధ్య వివాదాలు రాకుండా పులికాట్ సరస్సును ఫ్రీజోన్‌గా చేసే విధంగా కృషి చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.రేఖా రాణి మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతం చేయడానికి అధికారులు స్వచ్ఛంధ సేవాసంస్థలు ఇచ్చిన సలహాల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో మాజీమంత్రి పరసారత్నం, డి.ఆర్.డి.ఎ పి.డి చంద్రమౌళి, డ్వామా పి.డి శ్రీమతి గౌతమి, జడ్పీటీసీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి, విజేత, శ్రీధర్, శ్రీమతి విజయలక్ష్మి, బిసి కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు, ఐటిడిఎ పిడి వై.వెంకటేశ్వర్లు, డిఎంఅండ్‌హెచ్ఓ డా॥ భారతీరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం పాతర... రోగాల జాతర

- అనిల్ ఆగ్రహం



నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 3వ తేదీ నెల్లూరు నగరంలోని 11వ డివిజన్‌లోని రాయపాళెం ప్రాంతంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకునేందుకు పర్యటించారు.

ఈ సందర్భంగా డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాయపాళెంలో ఎక్కువగా పేద ప్రజలు నివశిస్తున్నారని ఆ ప్రాంతంలో పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా ఉందని, అలాగే పారిశుద్ధ్య కార్మికులు 10రోజులకు ఒకసారి వచ్చి శుభ్రం చేస్తున్నారని స్థానికులు తెలపడంతో మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి కాబట్టి ఈ ప్రాంతంలో ప్రతి రెండురోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. నెల్లూరు నగరంలో ప్రధాన సమస్య పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడమేనని, ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించి పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబులి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, దేవరకొండ అశోక్, నాయకులు వందవాసి రంగ, దార్ల వెంకటేశ్వర్లు, పంట్రంగి ప్రసాద్, దామవరపు కోటి, చంద్రమౌళి, జి.బాలకృష్ణ, నారాయణ, సి.హెచ్.వెంకటరావు, బాబు, జనార్ధన్, నాగరాజు, సంపతి మహేష్, నాగేంద్ర, వి.శ్రీహరిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్ విషయంలో...

# అపోహాలు వద్దు!



నెల్లూరు నగరాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేయించేందుకే తాము కృషి చేస్తున్నామని, అందరితో చర్చించిన అనంతరం మాస్టర్‌ప్లాన్ ప్రకారమే రోడ్ల విస్తరణ జరుగుతుందని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబు అన్నారు. ఇటీవల ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 1978 తరువాత మాస్టర్‌ప్లాన్ అమలు జరుగకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పట్టణాలు, నగరాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌లే కీలకమన్నారు. ప్రజలతో, ప్రజాప్రతినిధులతో చర్చించిన తర్వాతే మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించారని, వాటిపై ఎవరూ అపోహలు పడాల్సిన అవసరం లేదని, పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు నగరంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్‌ప్లాన్ అమలు చేయడం ఎంతో అవసరమని, నగరంలో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఎంత స్థలాలు అవసరమనే విషయంపై సర్వే చేయిస్తున్నామని, దీనిపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ప్రజలకు మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన కలిగిస్తామన్నారు. ఇందుకు త్వరలోనే కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రజాప్రతినిధులతో చర్చించిన తర్వాతనే ఈ విషయంపై ముందుకు వెళ్తామని, ఇందులో ప్రజలకు ఎలాంటి భయాలూ వద్దని, ప్రస్తుతానికి మార్కింగ్ చేస్తున్నామే తప్ప ఎలాంటి కూల్చివేతలు చేయడం లేదని, అందరితో చర్చించాకే మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఆయన వివరించారు. రోడ్డు విస్తరణవల్ల నగరం అభివృద్ధి చెంది ప్రజలందరికీ మేలు జరుగుతుందే తప్ప అన్యాయం జరగదని ఆయన అన్నారు. మాస్టర్‌ప్లాన్ అమలుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# 'ప్రభా'తం

ఛత్తీస్‌గఢ్..అంటేనే మావోయిస్టులకు ఒక అడ్డాగా తయారైంది. అదొక నెత్తురుగఢ్‌గా రూపుదాల్చింది. పొంచివున్న తీవ్రవాదానికి మరోపేరుగా.. దారుణ మారణహోమాలకు నెలవుగా మారిపోయింది. తాజాగా మరో ఘోరానికి..దారుణానికి వేదికైంది. ఛత్తీస్‌గఢ్‌లో ఎప్పుడూ తీవ్రవాదం మాటువేసే వుంటుంది. అదనుచూసి అది నరమేధాలకు తెగబడుతూనే వుంది. అందుకే ఈ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు ఎప్పుడూ తీవ్రవాదపు కోరల మధ్య నలిగిపోతూనే వుంటాయి. భయం గుప్పెట్లో చిక్కుకుని.. గుండెలు చిక్కబట్టుకుని.. బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతూ వుంటాయి. తీవ్రవాదం ఇక్కడ ఎప్పుడు.. ఎలా విరుచుకుపడుతుందో చెప్పలేం. అది మృత్యుర్యాకాసిలా మారి ఎంతమంది ప్రాణాలను బలిగొంటుందో ఊహించలేం.

ఈ నెల 1న ఛత్తీస్‌ఘడ్‌లోని సుక్మా జిల్లా మళ్ళీ నెత్తురోడింది. అక్కడ అటవీప్రాంతంలో మాటేసిన మావోయిస్టుల దాడిలో ఏకంగా 14 మంది జవాన్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అత్యంత ఘోరమైనది.. దారుణమైనది. ఇది మావోయిస్టుల దురాగతాలకు పరాకాష్ట. సుక్మా జిల్లాలోని అటవీప్రాంతంలో సాధారణ ప్రజలను రక్షక కవచాలుగా వాడుకుని, సిఆర్‌పిఎఫ్ బలగాలపై మావోయిస్టులు ఒక్కసారిగా విరుచుకుపడి విచక్షణా రహితంగా కాల్పులకు ఒడిగట్టడం దారుణం.

ఈ దాడిలో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ అధికారులతో సహా, 14 మంది జవాన్ల ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. మరో 15 మందిదాకా జవాన్లు ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లాఆర్మీ వారోత్సవాలను నిర్వహించేందుకు పిలుపు నివ్వడంతో, వారు హింసాత్మక చర్యలకు పాల్పడ వచ్చనే అనుమానంతో భద్రతాదళాలు దండ కారణ్యంలోని ఈ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ దశలో తిరిగివస్తున్న భద్రతాదళాలపై మావోయిస్టులు ఒక్కసారిగా మెరుపుదాడి చేసి కాల్పులు జరిపారని, అయితే, కాల్పులు జరుపుతున్న దశలో తాము కూడా భీకరపోరు జరిపితే, మావోయిస్టులు రక్షక కవచంగా అడ్డుపెట్టుకున్న సాధారణ ప్రజలు కూడా మరణిస్తారనే భావంతో, జవాన్లు సంయమనం పాటించి, మావోయిస్టుల దాడిని బలంగా ఎదుర్కోలేకపోయారని పోలీసువర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే, ఇప్పుడే కాదు గతంలోనూ మావోయిస్టులు ఈ ప్రాంతంలో తమ ప్రాబల్యాన్ని నిరూపించుకునేందుకు ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతూనే వున్నారు. గత నెలలో కూడా సుకుమా జిల్లాలో ఆరుగురు జవాన్లను గాయపరిచారు.

అంతేకాదు, గత ఏడాది మే నెలలోనూ ఇదే జిల్లాలో కాంగ్రెస్ నేతల వాహనశ్రేణిని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ సంఘటనలో 28 మంది మరణించారు. 2007లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఓ పోలీస్ తనిఖీకేంద్రంపై మావోయిస్టులు దాడిచేసి 55 మంది పోలీసుల ప్రాణాలను బలితీసుకున్నారు. ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు, ఇదేవిధంగా మహారాష్ట్ర, ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాల్లోనూ మావోయిస్టులు మెరుపుదాడులు చేస్తూనే వున్నారు.

మావోయిస్టులు ఇలా తమ ఉనికిని చాటుకునేందుకు, తమ ప్రాబల్యాన్ని నిరూపించుకునేందుకు ఇలాంటి పాశవిక దాడులకు తెగబడుతూనే వున్నారు. పెట్రేగిపోతున్న ఈ తీవ్రవాద సమస్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం పరిష్కరించాల్సి వుంది. ఈ పరిస్థితులు మళ్ళీమళ్ళీ పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి వుంది.

తీవ్రవాదం బాగా విస్తరించివున్న ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు గత ప్రభుత్వం ప్రవేశపెట్టినా అవి నామమాత్రంగానే వుండడంతో ఆచరణలో ఎలాంటి ప్రయోజనాలూ సాధించకపోవడం విచారకరం. గత ప్రభుత్వంలోని అస్తవ్యస్త విధానాలు, ప్రకృతి సంపదతో అలరారుతున్న అటవీప్రాంతాలను పలు బహుళజాతి సంస్థలకు చిత్తం వచ్చిన రీతిలో కేటాయించడం వంటి కారణాలు కూడా ఆయా ప్రాంతాల్లోని గిరిజనులు, నిరుపేద ప్రజలపై తీవ్రవాదుల ప్రాబల్యం పెరగడానికి ఆస్కారం కలిగిస్తున్నాయనే అభిప్రాయాలూ వున్నాయి. పెరిగిపోతున్న పేదరికం, నిరుద్యోగంతో పాటు, నిరుపేద ప్రజలకు, గిరిజనులకు జీవనాధారంగా వున్న అడవులు, అటవీప్రాంతాలు, అభివృద్ధి ఫలాలు క్రమేణా పేదలకు దూర మవుతుండడంతో ఆయా ప్రాంతాల్లో తీవ్రవాదం ప్రబలిపోతోందని గత ప్రభుత్వ హయాంలో నిపుణులు అభిప్రాయాలు వెల్లడించినా అప్పట్లో పట్టించుకున్న వారు గానీ, పరిగణనలోకి తీసుకున్నవారు గానీ లేరు.

ఇకనైనా, కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అన్ని కోణాల్లో ఈ సమస్యను అధ్యయనం చేయాలి. నిపుణులతో చర్చించాలి. నిఘా యంత్రాంగాన్ని పటిష్టం చేసి, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలి. ఇక ఏ ఒక్క రాష్ట్రంలోనో కాదు.. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి మారణకాండలూ, నరమేధాలూ జరుగకుండా తీవ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు అన్ని విధాలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో వెనుకబాటుతనాన్ని నివారించేందుకు, అభివృద్ధి పథకాలను ముమ్మరం చేయాలి. ప్రగతిని అస్త్రంగా చేసుకుని తీవ్రవాదాన్ని ధీటుగా ఎదుర్కోవాలి. తీవ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు అన్ని కోణాల్లోనూ అవసరమైన అన్ని చర్యలనూ పటిష్టంగా చేపట్టాలి. ప్రబలిపోతున్న తీవ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిరోధించి.. ప్రజలంతా ఎలాంటి వేదనలూ.. వాదనలూ లేని ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు సకల చర్యలూ తీసుకోవాలి. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం సమాయత్తం కావాలి.

## ఘోరం.. దారుణం



**ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదం పెట్రేగి పోతోంది. తమ ఉనికిని చాటుకునేందుకు, తమ ప్రాబల్యాన్ని నిరూపించుకునేందుకు మావోయిస్టులు భద్రతా దళాలపై పాశవిక దాడులకు తెగబడుతూనే వున్నారు. తీవ్రవాదాన్ని అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా తీవ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు గట్టిచర్యలు చేపట్టాల్సివుంది.**

# ఉత్తేజానికి గ్రీన్‌చాయ్ ఉత్తమం

ఉత్తేజానికి గ్రీన్‌చాయ్ ఉత్తమమైనది. మనం తీసుకునే ఆహారపదార్థాల్లో చాయ్ ముందు వరుసలో వుంటుంది. ఇది మన జీవితాల్లో అంతర్భాగమైపోయింది. నాల్గవ శతాబ్దంలో చైనావైద్యుడు తొలిసారిగా తేయాకు నుంచి టీ డికాక్షన్ తయారుచేసి తాగితే అతనికి ఉత్తేజం కలిగి... ఆ తరువాత తన వద్దకు వచ్చే రోగులకు సైతం ఈ పానీయాన్ని ఇచ్చాడనంటారు. అలా ఔషధంగా పరిచయం అయిన తేనీరు, ఇప్పుడు దైనందిన జీవితంలో ఒక భాగమైపోయింది. చైనా, జపాన్ దేశాల్లో టీ సేవించడాన్ని గొప్ప ఉత్సవంగా నిర్వ హిస్తారు. అక్కడ పాలు, పంచదార కలప కుండా టీ డికాషన్ మాత్రమే తాగుతారు. ఇక అమెరికాలో టీ డికాషన్‌లో ఐస్, పంచదార వేసి తాగుతారు. టిబెట్‌లో గ్రీన్‌టీని ఉప్పువేసుకుని కొయ్యకప్పుల్లో, ఆఫ్రికాలో టీ డికాషన్‌ను బాగా సురగవచ్చే వరకు చిలికి... ఆ తరువాత తాగుతారు. పశ్చిమ ఆసియాలో టీ డికాషన్‌లో యాలకలు తప్పనిసరిగా వేస్తారు. అలసటగా ఉన్నప్పుడు వేడివేడి టీ సిప్‌చేస్తే... అలసట చిటికెలో మాయం అవుతుంది. ప్రజల జీవితాల్లో ఇంతగా మమేకమైన టీలో ఇప్పుడు అనేక రకాల ఫ్లేవర్స్ వచ్చి చేరాయి.



అయితే సహజంగా ఉత్తేజాన్నిచ్చే టీకి ఆరోగ్యానికిచ్చే కొన్నింటిని చేర్చడంతో... ఉల్లాసం... ఉత్తేజంతో పాటు ఆరోగ్యం ఇచ్చేలా ఇప్పుడు టి అందుబాటులోకి వచ్చింది. గ్రీన్ టీ... ఎండిన తేయాకులతో చేసే గ్రీన్ టీ ఎంతో ఆరోగ్యకరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో ఎలాంటి రసాయనాలు కలపకుండా, ప్రాసెసింగ్ చేయకుండా సహజమైన తేయాకులను ఉపయోగిస్తారు. గ్రీన్ టీ సేవిస్తే మానసిక వత్తిడి, ఉదరకోశ వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇందులో పాలు కలపాల్సినవసరం లేదు కాబట్టి స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధులు దరిచేరవు. కొలెస్ట్రాల్‌ను నివారిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను అరికడతాయి. గ్రీన్ టీని తేనె, నిమ్మరసంలో కలిపి తీసుకుంటే ఉల్లాసం రెట్టింపు అవుతుంది.

## హుద్‌హుద్ బాధితులకు రూ.2లక్షల విరాళం

హుద్‌హుద్ తుఫాను బాధితులను ఆదుకునేందుకు అఖిల భారతీయ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్ళపాక రమేష్‌రెడ్డి రూ.2లక్షల విరాళాన్ని డిడి రూపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరుజిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణల సమక్షంలో విరాళాన్ని ముఖ్యమంత్రికి అందించారు.

## కోటంరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరుజిల్లాలోని 7 ఓసి అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలిచిన ఎమ్మెల్యేలు నెల్లూరు శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి. ఆర్థికంగా స్థితి మంతులు, కోటీశ్వర్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కోటంరెడ్డి సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు. అటువంటి నాయకులు తమ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఏ సమస్యను ప్రస్తావించినా ఆ సమస్యల పరిష్కారానికి తనవంతు లక్షలాది రూపాయలు విరాళాలిస్తున్న తీరు అభినందనీయం. ఆర్థికంగా స్థితిమంతులైన ఎమ్మెల్యేలు చేయలేని పని చేస్తున్న కోటంరెడ్డిని మిగతా ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రతిపక్ష నాయకుడు వై.యస్.జగన్ కోటంరెడ్డి లాంటి మంచినేతను ప్రోత్సహించాలని సూచిస్తున్నాము.

**యస్.బి.రావు, కావలి.**

## ముసవ్వీర్‌ను సన్మానించాలి

స్వర్ణం, వెండితో ఎన్నో అద్భుతాలను, సూక్ష్మకళారూపాలను సృష్టిస్తున్న జనాబ్ షేక్ ముసవ్వీర్‌ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యంగా నెల్లూరుజిల్లా అధికారులు సన్మానించాలి. అవార్డు ఇవ్వాలి. మన 'లాయర్' ఈ కళారూపాలను గుర్తించి తెలియపరుస్తున్నందుకు కృతజ్ఞతలు. స్వర్గీయ శ్రీ తుంగా రాజగోపాలరెడ్డి గారు స్థాపించిన 'లాయర్' దినదినాభివృద్ధినొందుతున్నది. సంతోషం. **- కె.సుబ్రహ్మణ్యం, కావలి.**

## ప్రత్యామ్నాయ రోడ్లు

మాస్టర్‌ప్లాన్ ప్రకారం ట్రంకురోడ్డును పగలగొట్టాలంటున్నారు. ఒక్క ట్రంకురోడ్డును పది అడుగులు వెడల్పు చేయగానే ట్రాఫిక్ సమస్య మొత్తం పరిష్కారమౌతుందా? దీనివల్ల కొందరు వ్యాపారుల బ్రతుకులను నాశనం చేయడం తప్పితే పెద్దగా ఫలితం ఉండదు. దీనిబదులు ప్రత్యామ్నాయరోడ్లను నిర్మించి ట్రాఫిక్‌ను మళ్ళిస్తే ఫలితముంటుంది.

**జి.గోవర్ధన్, నెల్లూరు.**

## శిఖర వీరుడు మోడీ

ప్రధాని మోడీ శ్రమ ద్వారా జాతినిర్మాణం చేస్తున్నారు. పాలనలో కుల, మతాలకు పీట వేయడం లేదు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన సియాచిన్ సైనిక ప్రాంతంలో సైనికులతో కలసి మోడీ దీపావళి చేసుకోవడం అద్భుతం. దేశభక్తిని ఇనుమడింపజేస్తూ జాతీయ సమైక్యతకు తోడ్పడే మోడీ లాంటి నాయకుడు పదికాలాల పాటు ఉండాలి. **- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## రైతులను బెదిరిస్తారా?




రాజధాని కోసం మా భూములు లాక్కోవద్దంటూ విజయవాడలో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన రైతులపై కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు ఆగ్రహావేశాలు చూపడం సముచితం కాదు. మీరు భూములివ్వక పోతే రాజధానిని తరలిస్తామంటూ బెదిరించడం కూడా తగదు. రాజధానికి అవకాశాలున్న చోటే పెట్టాలిగాని ఇలా రైతుల కడుపుకొట్టి కాదు. ఇక్కడ రాజధానిని కులపిచ్చితో పెట్టారేగాని ఇంకేమైనా సానుకూల అంశముందా?

**ఎస్.కె.బాదుల్లా, మార్టూరు.**



- ఎటుచూసినా చెత్తకుప్పలు.. మురుగుదిబ్బలు
- డెంగీతో ప్రజల బెంబేలు..పట్టించుకోని అధికారులు
- మచ్చుకైనా కానరాని "స్వచ్ఛభారత్"



*ఎటు చూసినా కట్టుచీమల్లా కసిగా కుట్టే దోమలు, మురుగుగబ్బుతో వీధులు, మురికి కూపంగా మారి..నరకం చూపిస్తున్న నగరం..ఇదీ నెల్లూరు నగర ముఖచిత్రం. నెల్లూరు స్మార్ట్‌సిటీగా అవుతుందో లేదో తెలియదు కానీ, ఇప్పటికే ఇది దోమలసిటీగా మారిపోయింది. నగరంలో ఎక్కడ చూసినా మురుగు, చెత్తకుప్పలు నిండిపోవడంతో ఇక దోమలకు, వాటి ద్వారా వచ్చే నానా రకాల వ్యాధులకు అడ్డేముందీ?..ఒక వైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం వుండేలా చూసుకోవాలని పదేపదే చెప్తున్నా, నెల్లూరు దాకా ఆ మాటలు వినవచ్చినట్లుగా లేదు. నగరంలో ఏ వీధిలో చూసినా మురుగుదిబ్బలు..మురికి కాలువలు..చెత్తకుప్పలు..మురుగుగబ్బు తాండవిస్తుండడం అందుకు నిదర్శనం.*

# స్మార్ట్ సిటీ కాదు... ఇది 'దోమల సిటీ'

నెల్లూరంటేనే దోమలనగరంగా ప్రఖ్యాతి చెందుతోందా అనిపిస్తోంది. పగలు రాత్రీ తేడా లేకుండా పొద్దస్తమానం ఈ మాయదారిదోమలు జనాన్ని కుట్టికుట్టి చంపుతున్నాయి. ఎన్ని రకాల లిక్విడ్‌లు వేసినా, పొగచుట్టలు పెట్టినా 'ఆహా!.. ఇవి ఎంత బావున్నాయో!'.. అంటూ దోమలు ఆహ్లాదిస్తూ ఆస్వాదిస్తున్నాయే తప్ప, అవి పోవడమూ లేదు..చావడమూ లేదు. బహుశా నెల్లూరు నగరంలో మాత్రం దోమలకు చావు లేదని దేవుడు వరమిచ్చాడో ఏమో తెలియదు కానీ, ఒక దోమను చంపినా, వంద దోమలు అదే పనిగా పుట్టుకొస్తున్నాయంటూ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుయ్యోమొర్రోమంటున్న నిరుపేద గుడిసెవాసులను, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకాన్నే కాదు, ఎవరెంతటి వారైనా సరే మాకేం అన్నట్లుగా, ఎవరినీ వదలకుండా కుడుతున్న ఈ దోమలతో, వాటి కాటుతో వచ్చే డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అయినా, సంబంధిత అధికారుల్లో కానీ, పాలకుల్లో కానీ ఎలాంటి చలనం లేదు. డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు విజృంభిస్తున్నా అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నారే తప్ప, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం గానీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను తెలియజెప్పడంలోగానీ ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. మురుగు కూపాలను నివారించేందుకు కానీ, సైడుకాలువలు మురుగుమడుగులుగా తయారై వీధుల్లోకి జివజివలాడుతూ పొంగివస్తున్నా, ఆ కాలువల్లో పూడిక తీయడంగానీ, రోడ్లనంతా ఆవరించి ఆక్రమించుకుంటున్న చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించడంలోగానీ ఎలాంటి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామని అంటుంటారే తప్ప, అసలు ఫాగింగ్ జరగడమే లేదు. దోమల నివారణకు మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేసేవారు అసలు కనిపించడం లేదు. పారిశుద్ధ్య పరిరక్షణ అంటారే తప్ప, దానిని పట్టించుకునే వారే లేరు. అధికారులు నిత్యం వాహనాల్లో తిరుగాడే ప్రధాన వీధుల్లో సైతం మురుగుదిబ్బలు పెరిగిపోయి గబ్బు కొడుతున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

**పడకేసిన ప్రజారోగ్యం.. పట్టించుకోని అధికారులు :**

పారిశుద్ధ్యం పర్యవేక్షించాల్సిన ప్రజారోగ్యశాఖ ఎప్పుడో పడకేసింది. ఇప్పుడది గాఢ నిద్రలో వుంది. ఎన్ని దోమలు కుట్టినా దాని నిద్రమత్తు వదలడం లేదు. ప్రజారోగ్య అధికారుల్లో కానీ, సిబ్బందిలో కానీ ఎలాంటి చలనం వుండడం లేదు. ఫలితంగా, రోజురోజుకీ నగరం నరకంగా, మురికికూపంగా, దోమలకు నిలయంగా మారిపోతున్నదే తప్ప, పారిశుద్ధ్యం అన్న మాట కనిపించడం లేదు. చిన్నపిల్లలు అనేకమంది దోమలకాటుకు గురై, రకరకాల వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూనే వున్నారు. డెంగీ, (మిగతా 10వ పేజీలో)

## చెత్త ఆటోలు..చెత్త బ్రతుకులు

నెల్లూరు నగరపాలక సంస్థలో చెత్తను తీసుకువెళ్ళే కొన్ని ఆటోలది పెద్ద వేదనైపోయింది. ఎప్పుడో పాతకాలం నాటి ఆటోలవి. ఎన్నాళ్ళనుంచో మరమ్మతులకు గురైవున్నాయి. ఎంత బాగుచేసినా.. ఎప్పుడూ ఏదో ఒక రిపేరు వస్తూనే వుంటోంది. కదిలినట్లు కదిలి, మళ్ళీ మొరాయిస్తుంటాయి. బుర్రుమని కొద్ది దూరం పోగానే మళ్ళీ ఏదో అర్జంట్ పనివున్నట్లు ఆగిపోతుంటాయి. ఆగిపోయిన వాటిని మళ్ళీ స్టార్ట్ చేయాలంటే ఆ దేవుడు దిగి రావాల్సిందే. పాతకాలం నాటి ఈ ఆటోలకు ఇంజన్‌లు సరిగ్గా పనిచేయక కాబోలు, గురుగుర్‌మని అంటుంటాయే తప్ప అంగుళం కూడా కదలవని అంటున్నారు. స్టార్ట్ చేసీ, చేసీ..చివరికి అవి కదిలేలోగా వున్న ఆ కాస్త డీజిల్ అడుగంటిపోతోందని డ్రైవర్ల ఆవేదన. అయితే, ఈ ఆటోలకు అత్యాధునిక జిపియస్ విధానాన్ని బిగించి ఎంత దూరం తిరిగితే, ఆ లెక్క ప్రకారమే తమకు డబ్బు ఇస్తారని, అవి సరిగ్గా కదలకపోయినా, డీజల్ ఎంత వృధాగా ఖర్చయిపోయినా, చిన్నచిన్న రిపేర్లున్నా ఆ ఖర్చులన్నీ తామే భరాయించాల్సివస్తోందని, ఈ పాతకాలం నాటి చెత్త ఆటోలతో వేగలేక తమ బతుకులు కూడా చెత్తబతుకులుగా మారిపోయాయని వారు వాపోతున్నారు. ఈ ఆటోలకు ఇంజన్ ఆఫ్ చేసి ఆన్ చేసే పరిస్థితి కూడా లేకపోవడంతో చెత్తను లోడ్ చేసినంత సేపు ఇంజన్ నడుస్తూనే వుండడంతో డీజిల్ ఖర్చు ఎక్కువై తమ జేబులకు చిల్లుపడుతోందన్నది వీరి వేదన... వాదన. కొత్తగా వచ్చిన కమిషనర్‌గారు తమ బాధలు పరిశీలించి సమస్యలు తీర్చాలని, పాత ఆటోల స్థానంలో కొత్తవాటిని అనుగ్రహించాలని వారు కోరుకుంటున్నారు.

# కార్పొరేషన్‌లో పొలిటికల్ ఆపరేషన్





*ఆనం వాళ్లు రాజకీయంగా ఎంతో తెలివైనవాళ్లు. కాబట్టే 2005లో నెల్లూరు మున్సిపాల్టీని నగరపాలక సంస్థగా మార్చిన తర్వాత కూడా కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని తేలేదు. అందువల్లే కార్పొరేషన్‌లో దాదాపు పదేళ్లపాటు వారి హవా నడిచింది.*

మేయర్‌కు, కార్పొరేటర్లకు తగిన గౌరవ మర్యాదలు, హోదా, పరపతి దక్కింది. మొన్న సార్వత్రిక ఎన్నికల వరకు కూడా కార్పొరేషన్‌లో ఆనం రాజ్యమే నడిచిందంటే దానికి కారణం వారి అడుగుజాడల్లో నడిచే అధికారులను కమిషనర్లుగా వేసుకోబట్టే! 2011లో గత కార్పొరేషన్ పాలకవర్గం గడువు ముగిసాక కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్‌లకు ఐఏఎస్ అధికారులనే స్పెషల్ ఆఫీసర్లుగా వేసినా నెల్లూరులో మాత్రం అప్పటికి నాన్‌ఐఏఎస్‌గా వున్న బి.లక్ష్మీకాంతంను స్పెషల్ ఆఫీసర్‌గా వేసుకున్నారు.

కమిషనర్‌లుగా ఐఏఎస్ అధికారులొస్తే ఎలాంటి పరిస్థితులొస్తాయో రాజకీయ అనుభవంలో తెలుసు కాబట్టే ఆనంవాళ్లు నాన్‌ఐఏఎస్‌లను కమిషనర్‌లుగా తెచ్చుకున్నారు. ఐఏఎస్ కమిషనర్‌లు వస్తే మొత్తం పాలకవర్గమే డమ్మీగా మారుతుందనేది ప్రస్తుతం నెల్లూరునగరపాలక సంస్థలో చోటచేసుకుంటున్న పరిణామాలనుబట్టి చూస్తే తెలుస్తుంది.

కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునైనా నెల్లూరును అభివృద్ధి చేయాలన్న పంతంతో కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు మున్సిపల్ మంత్రి నారాయణను ఒప్పించి కమిషనర్‌గా ఐఏఎస్ కమ్ ఐపిఎస్ అయిన చక్రధర్‌బాబును వేయించారు. ఆయన వచ్చినప్పటినుండి పాలకవర్గానికి చుక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికారపార్టీలో చేరి నెల్లూరును నవాబులా పాలిద్దామనుకున్న మేయర్ అబ్దుల్‌అజీజ్‌కు కమిషనర్ వ్యవహారం అసలు మింగుడుపడడం లేదు. కార్పొరేషన్‌కు సంబంధించిన వ్యవహారాలన్నీ కూడా కమిషనర్ కనుసన్నలలోనే జరుగుతున్నాయి. కార్పొరేషన్ అధికారయంత్రాంగమంతా కూడా ఆయన వెంటే నడుస్తోంది. మేయర్ ప్రమేయం లేకుండానే స్టాండింగ్ కమిటి ఎన్నికల తేదీ వెలువడడం, రోడ్డు విస్తరణకు మార్కింగ్ ఇవ్వడం, మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయడం వంటివన్నీ జరిగిపోతున్నాయి. కమిషనర్‌కు భయపడి అధికారులు మేయర్ చేసే సిఫార్సులను పట్టించుకోలేకపోతున్నారు. దీనిని తీవ్ర అవమానంగా భావిస్తున్న మేయర్ అజీజ్ కమిషనర్‌ను బదిలీ చేస్తారా లేక నన్ను రాజీనామా చేసి పొమ్మంటారా అనే స్థాయిలో మున్సిపల్ మంత్రిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.




# ఇస్కాన్‌లో గీతా జయంతి




నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 2వ తేదీన గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందిరంలో హోమాలను నిర్వహించి భగవద్గీతలోని 18అధ్యాయాలను పారాయణం చేశారు. భగవద్గీత నమూనా గ్రంథాన్ని ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఈ వేడుకలలో పాల్గొని కొత్త సంవత్సర క్యాలెండర్‌ను, జనవరి 19న నిర్వహించనున్న జగన్నాథరథయాత్ర ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ శుకదేవ స్వామి భక్తులకు ఉపదేశాన్నిచ్చారు.

## రూ.2.45కోట్ల ఎంపి నిధులు విడుదల

నెల్లూరు ఎంపి నిధుల నుంచి మొదటి విడతగా రూ.2.45 కోట్లు వివిధ పనుల నిమిత్తం నెల్లూరుజిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. రూ.2.06కోట్లు మంచినీటి సరఫరాకు, మిగిలిన నగదు నెల్లూరులో పడారుపల్లి గ్రామం శ్మశానం అభివృద్ధి పనులకు, కేంద్ర కారాగారంలో ఖైదీల ఉపయోగార్థం అంబులెన్స్ కొను గోలుకు కేటాయించినట్లు నెల్లూరు ఎంపి మేకపాటి రాజ మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు.

## పశుసంవర్ధకశాఖ జేడిగా శ్రీధర్‌కుమార్

నెల్లూరుజిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా జేఎస్ఎస్ఎం శ్రీధర్‌కుమార్ సోమవారం బాధ్యతల స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి జేడీగా కొనసాగిన రవీంద్రనాథ్ నుంచి శ్రీధర్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. విజయనగరం పశు సంవర్ధక శాఖలో జేసీగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు వచ్చారు.

## డా॥ కరిమద్దెలకు సన్మానం



శ్రీ నెల్లూరు వర్ధమాన సమాజం, శ్రీ పెళ్ళూరు పట్టాభిరామిరెడ్డి స్మారక ధర్మనిధి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్‌లు స్మారక మందిరంలో మహాకవి పోతనామాత్యుని సాహిత్యసభ జరిగింది. ఈ సభలో పోతన కవిత్వం అంశంపై తెలుగు విశ్రాంతరీడరు డా॥ కరిమద్దెల నరశింహారెడ్డి ఉపన్యసిం చారు. స్వర్గీయ పెళ్ళూరు వజ్రావతమ్మ స్మృత్యర్థం నరశింహారెడ్డిని శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, పౌరాణిక కళాకారులు పొన్నాల రామసుబ్బారెడ్డి, వల్లకవి వేంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### జిల్లా ఉన్నతాధికారులుగా

## తమిళ తంబి - తంగచ్చి





ఏ జిల్లాకైనా అధికారి కంగా కలెక్టర్, ఎస్పీ ఉన్నత స్థాయి హోదాలు. నెల్లూరు జిల్లాకు ఈ రెండు పదవుల్లో తమిళనాడుకు చెందిన వ్యక్తులే అధికారులుగా రావడం విశేషం. ఇప్పటికే జిల్లా ఎస్పీగా వచ్చిన సెంథిల్‌కుమార్ తమిళనాడు వాసి. కాగా ఇప్పుడు కలెక్టర్‌గా వచ్చిన ఎం.జానకి కూడా తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. తెలుగురాష్ట్రానికి అది కూడా వారి రాష్ట్రంపక్కనే వున్న నెల్లూరుజిల్లాకు వాళ్ల ఉన్నతాధికారులు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం.

## సిఎంఆర్‌లో 'హంసా'నడకలు



నెల్లూరులోని సిఎంఆర్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. 'మిర్చి' సినిమా ఫేం హంసానందిని ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జ్యోతిప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించిన హంసానందిని ఆ తర్వాత క్యాట్‌లాగ్ శారీస్ కౌంటర్‌ను ప్రారంభించారు. షోరూంలో చీరలను, అందమైన నగలను పరిశీలించారు. ఇక్కడ ప్రదర్శిస్తున్న ఆభరణాలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని ఆమె చెప్పారు. గుణశేఖర్ దర్శకత్వంలో వస్తున్న 'రాణి రుద్రమదేవి' సినిమాలో ఓ మంచి పాత్ర చేస్తున్నానని, ఆ పాత్ర తన జీవితంలో మరపురానిదిగా మిగులుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు(వాసు), శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం మాజీచైర్మెన్ పత్తిరవీంద్రబాబు, రాజీయాడ్స్ అధినేత అలంకార్ పెంచలయ్య, శైలేష్, సిఎంఆర్ మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల అపూర్వసమ్మేళనం



నెల్లూరు సంతపేట లోని సిఏఎం హైస్కూల్ 1988 టెన్త్‌క్లాస్ బ్యాచ్ మేట్స్ విద్యార్థుల సమ్మే ళనం నవంబర్ 30వ తేదీ అనిల్‌గార్డెన్స్‌లో జరిగింది. ఆ బ్యాచ్‌కు సంబంధించి మొత్తం 240మంది పూర్వ విద్యార్థులుండగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 140మందిని సమీకరించారు. తమ బ్యాచ్‌లో వివిధ కారణాలతో చనిపోయిన 8మంది పూర్వవిద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని వీరు సంతాపం ప్రకటించారు. అలాగే పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ గడిపారు. అందరూ కలిసి పలు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. తర్వాత జరిగే సమావేశానికి కుటుంబసభ్యులతో కలసి హాజరుకావాలని నిర్ణయించారు.

ఈ సమ్మేళనానికి ఆర్.శ్రీనివాసరావు, వసంత్, దయాకర్, సురేష్, కోటేష్, మల్లి, జితేంద్ర, లడ్డుమల్లి, సుధీర్, కృపాకర్, చంద్ర, మునికిరణ్ వంటివారు శ్రీకారం చుట్టి విజయవంతం చేశారు.

### చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్..

## సేవలు అభినందనీయం



చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని నెల్లూరు నగర మునిసిపల్ కమిషనర్ చక్రధర్‌బాబు అన్నారు. గత నెల 29వ తేదీ నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్‌లో మాదరన్ ఐ హాస్పిటల్ & రీసెర్చ్‌సెంటర్ వారి సౌజన్యంతో చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వ హణలో ఉచిత కంటివైద్య శిబిరానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ త్వరలో చిల్డ్రన్స్‌పార్క్‌లో క్యాంటిన్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మాదరన్ ఐ హాస్పిటల్ అధినేత డాక్టర్ పిఎల్‌రావు మాట్లాడుతూ ఇలాంటి వైద్యశిబిరాలు ఉచితంగా నిర్వహించి పేదప్రజలకు సేవ చేస్తామన్నారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి 25మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి కంటి అద్దాలు, భోజనవసతి కల్పిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాముల రమణయ్య, బిజవేముల భాస్కర్‌రెడ్డి, టివి నటులు శింగంశెట్టి మురళీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘికశక్తుల భరతం పట్టాలి

**- నగర డిఎస్పీ మగ్బూల్**

నగరంలో పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని, నేరాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అసాంఘిక శక్తుల భరతం పట్టాలని నగర డిఎస్పీ మగ్బూల్ అన్నారు. శనివారం నగరంలోని నాల్గవ నగర పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు సూచించారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదే శించారు. అనుమానాస్పద వ్యక్తులను బైండోవర్ చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్‌పెక్టర్లు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, మంగారావు, ఎస్ఐలు నాగభూషణం, నాగేశ్వర రావు, వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## నగర సిటీప్లానర్‌గా శ్రీనివాసులు

నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిటీప్లానర్‌గా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప నగరపాలక సంస్థలో ఇన్‌ఛార్జి సిపిగా పనిచేస్తూ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

## ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడిగా శ్రీహరి

వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు పట్టణ ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడిగా పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో వి.శ్రీహరిరాయులును నియమించినట్లు వైయస్సార్‌సీపీ నెల్లూరుజిల్లా అధ్యక్షులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు.

## కన్నుల పండుగగా శ్రీనివాస కళ్యాణం

నెల్లూరు బివి నగర్‌లోని ఎఎన్ఆర్ కల్యాణ మండపంలో గత నెల 29వతేదీ రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళ వాయిద్యాల మధ్య, భక్తుల గోవింద నామస్మరణల మధ్య, స్వామివారి కల్యాణం ఆద్యంతం అత్యంత వేడుకగా జరిగింది. ఎఎన్ఆర్ కల్యాణ మండపం ప్రారంభోత్సవం సందర్భంగా, ఆ కల్యాణమండపం అధినేతలు బండి ఆదినారాయణరెడ్డి, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రీయ సంగీత గాయని జె.బాలార్క అన్నమాచార్య సంకీర్తలను హృద్యంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం, భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

# గుండెను ఆపకుండానే ఆపరేషన్

### అపోలోలో విజయవంతంగా శస్త్రచికిత్స

సాధారణంగా గుండెను ఆపరేషన్ చేయాల్సివచ్చినప్పుడు ఒక ప్రత్యేక మిషన్ ద్వారా, గుండెను ఆపి వైద్యులు శస్త్రచికిత్స చేస్తుంటారు. అయితే, అపోలో ఆసుపత్రి వైద్యులు అందుకు భిన్నంగా, గుండెను ఆపకుండానే విజయవంతంగా ఆపరేషన్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆ వివరాలను శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు. చెన్నై అపోలో ఆసుపత్రి ఛీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ డి. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఆసుపత్రిలో అత్యంతాధు నిక సౌకర్యాలు ఏర్పాటుచేశామని, 25 శాతం తక్కువ ఖర్చుతోనే ఈ బ్రీతింగ్‌హార్ట్ బైపాస్ సర్జరీని విజయవంతంగా చేశామని వివరించారు. హృద్రోగులు చెన్నై, హైదరాబాద్ తదితర దూరప్రాంతాలకు చికిత్సల కోసం ఎంతో వ్యయప్రయాసలకోర్చి వెళ్ళనవసరం లేకుండా ఇక్కడ వారికి అందుబాటులో వుండేందుకు ఈ ఆసుపత్రిలో ఆధునిక వైద్యవసతులు ఏర్పాటు చేశామన్నారు. అంతర్జాతీయ స్థాయి ఆపరేషన్ థియేటర్ సైతం ఈ ఆసుపత్రిలో అందుబాటులో వుందని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ కెవి మురళీధరన్, ఛీఫ్‌కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ పిఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

# పరిమళించిన మానవత్వం

## • సేవాజ్యోతిని ఆరిపోనివ్వని చేతులు



జయ ఫిలిప్స్‌తో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



బాధిత యువతికి అండగా అన్నగా...

**ఎదుటి మనిషి బాధను అర్థం చేసుకోవడానికి భాష తెలియనవసరం లేదు. భావం తెలిస్తే చాలు. బాధల్లో వున్న మనిషిని ఓదార్చడానికి కోట్లు వుండాల్సిన అవసరం లేదు. మనలో మంచి మనసు, మానవత్వం వుంటే చాలు. ఇలా మానవత్వాన్ని చాటే ప్రతిమనిషి మానవీయుడే!**

దాదాపు 20ఏళ్ల క్రితం నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలోని ఓ అనాధాశ్రమం ముందు అర్ధరాత్రి ఓ యువతి ఆర్తనాదాలు చేస్తుంది. తనను బ్రతికించమని మనకు తెలియని భాషలో, ఆమెకు వచ్చిన భాషలో వేడుకుంటుంది. ఆ అరుపులకు ఆశ్రమ నిర్వాహకురాలు జయాఫిలిప్స్ బయటకొచ్చారు. ఆ యువతి ఒళ్లంతా కాలిన యాసిడ్ గాయాలతో విలవిలలాడిపోతుంది. ఆ యువతిపై యాసిడ్ దాడి చేసిన దుండగులు అప్పుడే చీకట్లో కారులో ఉడాయించారు. ఆ బాధిత యువతిని జయ ఫిలిప్స్ చేరదీసింది. ఆ యువతి ఎవరో, ఏ రాష్ట్రమో, ఏ ఊరో తెలియకపోయినా తన సొంత బిడ్డలా అక్కున చేర్చుకుంది. తనకు తన భర్తకు వచ్చే పింఛన్ డబ్బుతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న ఆమె ఆ యువతిని కూడా తన సంరక్షణలో ఉంచుకుంది. దాదాపు 20 ఏళ్లపాటు ఆ యువతిని జయఫిలిప్స్ తన సొంత బిడ్డలా చూసుకుంది. ఇప్పుడు జయఫిలిప్స్‌కు 86ఏళ్లు. ఓ పక్క ఆశ్రమ నిర్వహణ భారం, ఇంకోపక్క వృద్ధాప్యం. ఆమె తర్వాత ఆ యువతికి దిక్కెవరు? ఈ సేవాదీపాన్ని ఆరిపోకుండా కాపాడే దెవరు?

ఈ ప్రశ్నలకు సమాధానమే నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ఈ విషాద ఉదంతం గురించి తెలుసుకున్న కోటంరెడ్డి మానవత్వంతో స్పందించారు. తోడపుట్టకపోయినా తోబుట్టువులా ఆ యువతిని సంరక్షించడానికి ముందుకొచ్చారు. ఆ యువతికి నెలకు 2వేల రూపాయలు ఖర్చవుతున్నాయని తెలుసుకుని, 5ఏళ్ల పాటు ఆ వ్యయాన్ని తానే భరిస్తానని ఆశ్రమ నిర్వాహకులకు భరోసా ఇచ్చారు. అలాగే నగరంలోని ప్రముఖ ఆసుపత్రుల యాజమాన్యంతో మాట్లాడి ఆ యువతికి వైద్యపరంగా చికిత్సనందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. 2వ తేదీ ఆయన ఆశ్రమానికి వెళ్లి బాధిత యువతిని పరామర్శించారు. 86ఏళ్ల వయస్సులో కూడా తమ పెన్షన్ డబ్బులతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న జయఫిలిప్స్ సేవానిరతిని చూసి కోటంరెడ్డి బాగా చలించిపోయారు. బర్త్‌డేలు, మందుపార్టీలు అంటూ వృధాగా తగలేస్తున్న డబ్బును ఇలాంటి సేవా కార్యక్రమాలకు కేటాయించాలని ఆయన కోరారు.

కోటంరెడ్డి జన్మతహ కోటీశ్వరుడు కాడు, పారిశ్రామిక, వ్యాపారవేత్త అంతకన్నా కాదు. కాని తన జీతభత్యాలను ఎన్నో మంచి పనులకు కేటాయిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. మానవత్వం పరిమళించిన మంచిమనిషిగా రాణిస్తున్న కోటంరెడ్డికి 'లాయర్' అభినందనలు.

# బాధ్యతలకు శ్రీకారం

నెల్లూరుజిల్లా 91వ కలెక్టర్‌గా యం.జానకి ఈనెల 1వతేదీ జిల్లా సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ రేఖారాణి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ముందురోజే నెల్లూరులోని పినాకిని అతిథిగృహం చేరుకుని బస చేసిన జానకి, 1వతేదీ ఉదయం 8.20గంటలకల్లా కలెక్టర్ ఛాంబర్‌కు చేరుకున్నారు. ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా ఆమె బాధ్యతలు స్వీకరించడం ఎంతో హుందాగా అనిపించింది. తోటి ఉద్యోగులకు కూడా ఆనందం కలిగించింది. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆమె గ్రీవెన్స్‌డేకు హాజరయ్యారు. ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. మధ్యాహ్నం ఒంటిగంటదాకా గ్రీవెన్స్‌డేలోనే గడిపిన ఆమె తర్వాత ఛాంబర్‌కు వెళ్లారు. భోజనం తర్వాత ఆమెను వివిధశాఖల ఉన్నతాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


### పి.ఆర్ కండ్రిగ పనులపై సమీక్ష...



షెడ్యూల్డ్ తెగల కుటుంబాల వారికి జీవనోపాధి సంవత్సరకాలం పాటు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్లో పుట్టంరాజు కండ్రిగలో ఎంపి ల్యాడ్స్ క్రింద జరుగుతున్న పనులను గురించి అధికారులతో సమీక్షించారు. ఆ గ్రామంలో గిరిజన కుటుంబాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత ఆమె మాట్లాడుతూ జాతీయ హామీ పథకం ద్వారా మరియు స్వయంఉపాధి కార్యక్రమాల ద్వారా గిరిజనులకు ఉపాధి కల్పించి వారు వలస పోకుండా చూసి గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆ గ్రామంలో జరుగుతున్న ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, రోడ్ల నిర్మాణాలు, విద్యుచ్ఛక్తి, త్రాగునీరు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ శ్రీమతి జి.రేఖారాణి, అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, డ్వామా పి.డి శ్రీమతి గౌతమి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి జితేంద్ర, గూడూరు రెవెన్యూ డివిజినల్ అధికారి రవీంద్రబాబు, పంచాయితీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

# మరుపుకు రారు... మన మాగుంట



నెల్లూరు రంగనాయకులపేట, రాఘవ కళ్యాణ మండపంలో దివంగత నేత మాజీ పార్లమెంటుసభ్యులు మాగుంట సుబ్బరామరెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే సివిశేషారెడ్డి, మాజీఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, మాజీ జెడ్పీఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్, ఏసునాయుడు, రఘురాంముదిరాజ్, టి.బాలసుధాకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ, వ్యాపారవేత్త సూర్యనారాయణరెడ్డి, మన్నెం భవానమ్మ, కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యులు ప్రమిద శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మాగుంట సుబ్బరామరెడ్డి మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సి.హెచ్‌కృష్ణవేణి, ప్రిన్సిపల్ జి.మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

# వసంత లక్ష్మికి డాక్టరేట్



సామాజిక సేవలకు గుర్తింపుగా వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్ అధినేత్రి టి.వసంతలక్ష్మికి శ్రీలంక దేశం, కొలంబోలోని ది ఓపెన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటి ఫర్ కాంప్లిమెంటరి మెడిసిన్స్ వారు సోషల్ వర్కర్ విభాగం క్రింద అత్యున్నత, ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్‌ను నవంబర్ 30వ తేదీన ఇంగ్లాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సర్ జాన్స్‌హోంసన్ చేతులమీదుగా అందజేశారు. 97ఆసియా దేశాల సభ్యుల సమావేశంలో ఒక తెలుగు యువతి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం సింహపురికే గర్వకారణం. వసంతలక్ష్మి నెల్లూరు, చుట్టుపక్క ప్రాంతాల ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను గతంలో భారత ప్రభుత్వంచే ఇందిరాప్రియదర్శిని అవార్డు, దూరదర్శన్ వారిచే సేవామణి అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే బెస్ట్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డును, సన్మానాలు, సత్కారాలు అందుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా మంగళవారం విలేకర్లతో వసంతలక్ష్మి మాట్లాడుతూ గత 25సంవత్సరాలుగా నెల్లూరులోని వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారు ఎందరో అనాథలకు, అభాగ్యులకు అండగా వుంటూ సేవా ప్రపంచంలో తమకు ఎదురులేదని నిరూపించుకుంటూ ఎంతోమందికి సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ ఇలాగే ముందుముందు కూడా ఇటువంటి సామాజిక కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రజల మనిషి.. మాగుంట సుబ్బరామిరెడ్డి



దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రజల మనిషి అని, ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఏనాటికీ మరచిపోలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. ముఖ్యంగా పేద, బడుగ, బలహీనవర్గాల ప్రజల కోసం మాగుంట సుబ్బరామిరెడ్డి ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ప్రజల మనసుల్లో ఆయన స్థానం సుస్థిరమని వారు కొనియాడారు. దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి 68వ జయంతి సందర్భంగా, నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో వున్న వికలాంగ బాలికల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్, మాజీ జడ్పీ ఛైర్మెన్ పి.చెంచల బాబుయాదవ్, కేంద్ర ఫిల్మ్ సెన్సార్‌బోర్డ్ సభ్యుడు ప్రమిద శ్రీనివాసులు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు టి.బాల సుధాకర్ తదితరులు పాల్గొని సుబ్బరామన్న సేవలను, ఆయన గొప్పతనాన్ని గురించి వివరించారు.

## ఎస్వీరత్నం ఛారిటబుల్ ట్రస్టు మరియు రోటరీక్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో

# ఉచిత వైద్యసేవలు




మాట్లాడుతున్న ఎస్వీ రత్నం ఛారిటబుల్‌ట్రస్ట్ ట్రస్టీ ఎస్.రామ్మోహన్‌రావు, ప్రక్కన క్లబ్ ప్రతినిధులు, డాక్టర్లు

గూడూరు రెండోపట్టణంలోని జానకి రాంపేట ప్రాంతంలోని బీసీ వసతిగృహ విద్యార్థినులకు ఎస్వీరత్నం ఛారిటబుల్‌ట్రస్ట్ మరియు రోటరీ వెస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం ఆదివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ రత్నం ఛారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కంటి, దంత, చిన్నపిల్లల వ్యాధి నిపుణులచే విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రధానంగా వసతి గృహాల్లో విద్యనభ్యసించే వారు పేదలని, వారి ఆరోగ్య సంరక్షణ కోసం తాము ప్రతి యేటా వారికి ఎటువంటి వ్యాధులు ఉన్నాయో గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు, కళ్లజోళ్లను అందిస్తామన్నారు. అలాగే ఇంటర్, పదవ తరగతిలో మంచిమార్కులు సాధించిన వారికి తనవంతు ప్రోత్సాహం ట్రస్టు తరపున అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకన్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులు శిక్షణ కలిగి ఉండి ఉత్తమ విద్యాబోధన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్వీ రత్నం ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతియేటా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో కంటి, దంత, చిన్నపిల్లల వైద్యులు ప్రకాష్, నారాయణ, పాలూరు మహేందర్‌రెడ్డి, షేక్ నౌషాద్ బేగం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రబాబు, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాసిన నాగులు, దువ్వూరు రవీంద్ర నాథ్‌రెడ్డి, ఎన్.సుదర్శన్‌రెడ్డి, బి.శ్రీకాంత్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సురేంద్రబాబు, వసతిగృహం వారు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీమియం సేకరణలో...

# గూడూరు ఎల్ఐసి అగ్రస్థానం

**- బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్**



ప్రీమియం సేకరణలో నెల్లూరు డివిజన్‌లోనే గూడూరు ఎల్ఐసి శాఖ అగ్రస్థానంలో ఉందని ఆ శాఖ బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్ 'లాయర్'కు తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఉన్న 21శాఖల్లో ప్రీమియం లోనూ, పాలసీల సేకరణలోనూ ముందంజలో ఉందన్నారు. గత నెలలో ఆలిండియా ఛైర్మన్ హానర్ పోటీల్లో గూడూరు శాఖ బ్రాంచ్ మేనేజర్ అర్హత సాధించారన్నారు. ఈ ఘనత సాధించేందుకు సీనియర్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్ బాబు, మార్కెటింగ్ మేనేజర్ బాలయ్య చౌదరి, మధుసూధన కృషి చేశారన్నారు. అలాగే తమ శాఖ సహాయమేనేజర్ ఆంజనేయులు, సిబ్బంది అభివృద్ధి అధికారులు, ఏజెంట్లు సహకారం కూడా మరువలేనిదన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

# స్వర్ణముఖి బచావో..

**- ఇ.ఓ.కు వై.ఎస్.ఆర్.సి.పి వినతి**



ఇ.ఓ. రామిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు

దక్షిణకాశిగా పిలువబడే పవిత్ర పుణ్యక్షేత్రం వాయులింగేశ్వరుని క్షేత్రానికి స్వర్ణముఖినది ఎంతో పవిత్రమైనదని దానిని కాపాడాల్సిన బాధ్యత ఉందని కోరుతూ వై.ఎస్.ఆర్.సి.పి. చిత్తూరుజిల్లా అధికార ప్రతినిధి అంజూరు శ్రీనివాసులు ఇటీవల శ్రీకాళ హస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డికి "స్వర్ణముఖి బచావో" పేరుతో వినతి పత్రం అందచేశారు.

ఈ సందర్భంగా అంజూరు శ్రీనివాసులు ఇ.ఓ.తో మాట్లాడుతూ పవిత్రమైన స్వర్ణముఖినది దుస్థితికి చేరిందన్నారు. ఇంతక ముందు స్వర్ణముఖినదీ తీరం చాలా పవిత్రంగా వుండేదని వివరించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యంతో నేడు పూర్తిగా దేవస్థానమునకు సంబంధించిన వాడిన పూజ సామగ్రి, చెత్తాచెదారాలు దేవస్థాన సిబ్బంది స్వర్ణముఖినదిలో పోస్తూ డంపింగ్ యార్డుగా తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. వీరిని చూసి శ్రీకాళహస్తిలోని ప్రతి ట్రాక్టరు, టైరుబండ్ల వారు కూడా పాత కట్టడాలు కూల్చివేయగా వచ్చే రబ్బీష్‌ను కూడా స్వర్ణముఖిలో వేస్తున్నారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇవి జరుగుతున్నాయన్నారు. ఈనాటికీ వాయులింగేశ్వరుని ఆశీస్సులతో శ్రీకాళహస్తి వాసులకు త్రాగునీటి సమస్య రాలేదన్నారు. కారణం స్వర్ణముఖి ద్వారా భూగర్భ జలాలు దెబ్బతినకుండా వున్నాయన్నారు. ఇకనైనా స్వర్ణముఖిపై ప్రత్యేక దృష్టిని వుంచాలని భావితరాలకు స్వర్ణముఖిని సజీవంగా అందించాలన్నారు. స్వర్ణముఖి నందు డ్రైనేజీ కలవటం ద్వారా నీటి వనరులు కలుషితం అవుతాయన్నారు. నదీతీరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దే అవకాశం కలదన్నారు.జంట నగరాలలోని ట్యాంక్ బండ్‌ను తలపించే విధంగా తీర్చిదిద్దాలన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెల హరి, కౌన్సిలర్ వసంతమ్మ, పార్టీ నాయకులు ప్రవీణ్,శంకర్, సుబ్రమణ్యం, సురేష్, రవి, శేఖర్, శివలు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

## నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి

# అందరూ భాగస్వాములు కావాలి

**- స్పీకర్ కోడెల శివప్రసాద్**



పార్టీల కతీతంగా నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి కోడెల శివప్రసాద్‌రావు అన్నారు. తిరుమలేశుని దర్శించుకొని తిరుగుపయనంలో రోడ్డు మార్గాన సోమవారం గూడూరు పట్టణం లోని రోడ్లుభవనాల అతిథిగృహంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసారి శీతాకాల సమావేశాలు హైదరాబాద్‌లోనే జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లోనే సమావేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, సర్వారావుపేట నియోజకవర్గంలో దాదాపు 16,600మరుగుదొడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు రైల్వేస్టేషన్ నుంచి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు వెళ్లారు. స్టేషన్‌కు వచ్చిన మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, ఆర్డీవో రవీందర్, డిఎస్పీ కె.శ్రీనివాస్ స్పీకరు రైలు ఎక్కేవరకు ఉన్నారు.

# మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

**- ఆర్డీవో రవీందర్**



ఎక్కడైతే మహిళలు అభివృద్ధి పథంలో ఉంటారో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని ఆర్డీవో రవీందర్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళా మండలి భవనంలో ఇటీవల చేతివృత్తుల శిక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమాజంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ చేతివృత్తుల్లో మహిళలు శిక్షణ పొందాలని కోరారు. మహిళలకు పెయింటింగ్, టైలరింగ్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, ఆంధ్ర మహిళామండలి అధ్యక్షురాలు విష్ణువందన, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి.మైథిలి, క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సి.రోహిణి, పరమేశ్వరి, లక్ష్మి, కె.సీతారెడ్డి, జీవని, మంజుల, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

# విద్యార్థినులకు భోజనం ప్లేట్లు పంపిణీ



సన్మానంతరం విద్యార్థినులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న డిఎస్పీ, ఎమ్మెల్యే

గూడూరు పట్టణంలోని ఎస్.ఎం. ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు భోజనం ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ కె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో పోలీసు స్వచ్ఛంధసంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా స్వచ్ఛభారత్ చేద్దామని పిలుపునిచ్చారు. కోట అసోసియేట్స్ అధినేత కోట సునీల్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ చేసే సేవా కార్యక్రమాలకు తాను చేయూత నిస్తానన్నారు. ఎమ్మెల్యేను, డిఎస్పీని ఈ సందర్భంగా కోట సునీల్‌కుమార్ సన్మానించారు. తదుపరి డిఎస్పీ, ఎమ్మెల్యే చేత విద్యార్థినులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తోట సురేష్‌నాయుడు, నవీన్ జయకుమార్, చంద్రశేఖర్, జోనల్ ఛైర్మన్ మల్లు విజయకుమార్‌రెడ్డి, ఎమ్.మురళీ రెడ్డి, రామ్మోహన్‌రావు, కో-ఆర్డినేటర్ మరియు లయన్స్ పిఆర్ఓ కడివేటి చంద్ర శేఖర్, ప్రధానోపాధ్యాయిని పి.యం.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక వ్యవహారాలలో, లావాదేవీలందు ఆచితూచి వ్యవహరించండి. వృత్తివ్యాపారాలు సామాన్యంగా జరిగి, ఆదాయం సామాన్యంగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణాలు చేయడం, వీటి వల్ల అదనపు ఖర్చులుంటాయి. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలు లభించగలవు. బంధువర్గంతో స్వల్ప విభేదాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సంప్రదింపులు, ఆర్థిక ఒప్పందాలకు అనుకూల సమయం. శుభాకార్యాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బిడ్డల విద్యా, ఉద్యోగ శుభకార్య ప్రయత్నాలలో అనుకూలవార్తలు వింటారు. కొన్ని ఆశించిన పనులు సునాయాసంగా జరుగుతాయి. రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

విలువైన వస్తువులు కొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అదనపు ఖర్చులుండినా ఇబ్బందిపడరు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. శరీరానికి గాయాలు తగలవచ్చును. వస్తువు గాని, డబ్బు గాని పోగొట్టుకునే అవకాశం ఉంది. వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు సామాన్య రాబడి స్థితి ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పనులందు ఆటంకాలెదురైనా పట్టుదలతో నెరవేర్చు కొంటారు. వృత్తి వ్యాపారాలలో క్రొత్త పద్ధతులు, కొత్త ఆలోచనలు అమలు చేయడం, ఆర్థికంగా స్థిమిత పడటం, ఆదాయం పెరగడం ఉంటుంది. వస్తు వాహన రిపేర్లు, గృహ రిపేర్లు చేపట్టగలరు. ఉద్యోగులకు, అధికారులకు పనిసామర్థ్యం గుర్తింపు ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్యాలు నిర్ణయం కావడం, శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. ఆర్థికంగా బాగుండుట, ఆదాయం పెరుగుదల, వృత్తివ్యాపారారా లలో పోటీనెదుర్కొని నిలబడటం జరుగుతుంది. అయితే ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులుండటం, ఋణం చేయడం ఉంటుంది. బిల్లులు చెల్లింపులు జరుపుతారు. ఆస్తివ్యవహారాలు వాయిదా వేయడం మంచిది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికస్థితి బాగుంటుంది. వృత్తివ్యాపారాలలో మీ అంచనాలు, కొత్త పథకాలు అమలు చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. తలచిన పనులు సక్రమంగా జరుగు తున్నా టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగ నిర్వహణలో పొరపాట్లు దొర్లకండా జాగ్రత్తపడాలి. కుటుంబ వ్యవహా రాలు విసుగుపుట్టించినా సంయమనం పాటించండి. శుభకార్యాల ప్రయత్నాలు ఫలిస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి – మీ వాసి

తేది. 05.11.2014 నుండి
తేది. 11.12.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, వృషభ మిధున కర్కాటక రాశుల్లో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో రవిబుధ శనులు, ధనుస్సులో శుక్రుడు, మకరంలో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

### ముహూర్తములు

తే 6.12.2014ది శనివారం ఉ॥ గంట7.20 నుండి గంట 9.0 వరకు ధనుర్లగ్నమున వివాహ గృహారంభములు.

తే 7.12.2014ది ఆదివారము ఉ॥ గంట 7.15 నుండి గంట 9.27 లోగా ధనుర్లగ్నమున వ్యాపార కేశఖండన అన్నప్రాశన వివాహములు.

### మార్గశీర్ష మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 05 | శుక్ర | చతుర్థశి | సా॥గం.5.34వ॥ |
| తేది. 06 | శని | పూర్ణిమ | సా॥గం.5.06వ॥ |

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | ఆది | పాడ్యమి | సా॥గం.5.10వ॥ |
| తేది. 08 | సోమ | విదియ | సా॥గం.5.44వ॥ |
| తేది. 09 | మంగళ | తదియ | సా॥గం.6.48వ॥ |
| తేది. 10 | బుధ | చతుర్థి | రా॥గం.8.18వ॥ |
| తేది. 11 | గురు | పంచమి | రా॥గం.10.12వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అన్ని విషయాలలోను, పనులలోను ఉత్సాహాన్ని, ప్రతిభను ప్రదర్శిస్తారు. మంచి వృత్తివ్యాపార అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం, చిరకాల మిత్రులు, బంధువులను కలవడం జరుగుతుంది. పెండింగ్‌లోగల ఆస్థి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

స్తిమితంగా, ఇతరుల సలహాలు విని నిర్ణయాలు తీసి కొనవలసి ఉంటుంది. ఎందుకనగా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి చేసే కృషి ఫలితాలలో కొంత వరకు విజయం సాధిస్తారు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చు. రావలసిన బాకీలు కొంతవరకు వసూలు కాగలవు. సాంకేతిక కళాక్రీడారంగాల వారికి అభివృద్ధి బాగుంటుంది. ఆదాయవ్యయాలు సంతృప్తికరం.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. దుబారా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించిన ఆదాయం ఉండదు. గృహమార్పులు, స్థానమార్పులుం టాయి. కోర్టు కేసులు వాయిదా పడటం, బంధువుల అనారోగ్య వార్తలు వినడం జరుగుతుంది. శుభకార్య నిర్ణయాలతో మీ కృషి ఫలించవచ్చును.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉపయోగపడే ముఖ్యసమాచారాలు అందుకుం టారు. శుభకార్యాల ప్రయత్నాలు నెరవేరగలవు. చేపట్టిన పనులను జాగ్రత్తగా నిర్వహించగలరు. వృత్తి వ్యాపారా లలో మీ కొత్త పథకాలు ఉపయోగపడి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖులను, చిరకాల మిత్రులను కలుసుకొంటారు. రావలసిన బాకీలు కొంత అందు కుంటారు. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాల నిర్వహణలో స్థిరపడతారు. అయితే కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు ఋణాలు చేయవలసి రావచ్చును. కొన్ని అనవసర ఖర్చుల నుండి తప్పించుకొనలేరు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబసభ్యుల ప్రవర్తన ఇబ్బందిపెట్టినా సర్దుకొని పోవడం మంచిది. పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులు విధినిర్వహణలో జాగ్రత్త పడండి. నిరుద్యోగుల అవకాశాలకి సమయం పట్టొచ్చు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు మంచి ఆర్థికస్థితి, ఆదాయం ఉంటుంది. వృత్తిజీవనం కలవారికి ఆర్థిక ప్రోత్సాహం బాగుంటుంది. అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణాలు, వీటివల్ల అదనపు ఖర్చు లుంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. కోర్టు కేసులు, పెండింగ్ వ్యవహారాలు రాజీకి రాగలవు.

# ఉయ్యాల కాలువను ఆధునీకరించండి

**– టిడిపి నేత తాళ్ళపాక అనూరాధ**



చెత్తాచెదారాలతో నిండి, దుర్గంధభూయిష్టంగా తయారైన నగరంలోని ఉయ్యాలకాలువ పూడిక తీసి, ఆధునీకరించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ కోరారు. ఎంతోకాలం నుంచి ఈ కాలువ పూడిక తీయకపోవడం వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు పడు తున్నారని ఆమె సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల ఆమె అధికారులతో కలసి నెల్లూరులోని 47, 48 డివిజన్‌లలో పర్యటించి రోడ్లు, కాలువలను పరిశీలించారు. వారితో పాటు కమిషనర్ కూడా ఈ ప్రాంతాల పరిస్థితిని పరిశీలించారు. ఈ డివిజన్‌లలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు. అందుకు స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఉయ్యాల కాలువను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరపు సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి, చిరంజీవి నాయుడు, గోవిందరాజు, కృష్ణలు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యలు తీరుస్తాం



**– బిజెపి నాయకుడు కర్నాటి**

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కృషి చేస్తుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. ఇటీవల నెల్లూరులో బిజెపి లీగల్‌సెల్, జిల్లా–నగర కార్యవర్గాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యలను ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులైన హరిబాబు దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి తగు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన బిజెపి లీగల్‌సెల్ కన్వీనర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి న్యాయవాదికీ నెలసరి ఆదాయం గ్యారంటీ లేకపోవడం, పేద న్యాయవాదులకు తెల్లరేషన్‌కార్డులు లేకపోవడం తదితర సమస్యలున్నాయని, ఇళ్ళు లేనివారికి నివాసస్థలాలు, బ్యాంక్‌రుణాలు, హెల్త్ కార్డులు, ఉన్నత విద్యకోసం బ్యాంక్‌రుణాలు.. వగైరా సదుపాయాల కల్పనకు, అదేవిధంగా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు లీగల్‌సెల్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, నగర లీగల్‌సెల్ కన్వీనర్ ఇఎస్ జగదీశ్వర్, నాయకులు మారుతిరెడ్డి, న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్‌యుఐ

# వినూత్న నిరసన

విద్యార్థులకు అందాల్సిన స్కాలర్ షిప్‌లను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోన్నదంటూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఇటీవల వినూత్న నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులోని విఆర్‌సి సెంటర్ వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు భిక్షాటన నిర్వహించారు. జిల్లాలో స్కాలర్ షిప్, ఫీజ్ రీ–యింబర్స్‌మెంట్ దాదాపు 66 కోట్ల రూపాయల దాకా విడుదల చేయాల్సివుందని, అయినా ప్రభుత్వం ఆ నిధుల విడుదలలో కాలయాపన చేస్తూనే వుందని ఎన్ఎస్‌యుఐ జిల్లా శాఖ అధ్యక్షుడు అంజయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం విద్యార్థుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వెంటనే స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆయన కోరారు.

### ఎస్సీ, ఎస్టీ ఋణాలకు

# గడువు పెంచండి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు మంజూరుచేసే ఋణాల గడువును ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించాలని ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షులు అరవ పూర్ణప్రకాశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'మీ సేవ'లో, ఎమ్మార్వో, ఎండిఓ ఆఫీసుల నందు ఆదాయ, నివాస, కుల ధృవీకరణ పత్రాలు సకాలంలో అందక పోవడంతో ఋణాలు పొందలేక ఎస్సీ, ఎస్టీలు ఆందోళన చెందుతున్నారని, కాబట్టి గడువును పొడిగించాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించను

**– నెల్లూరుజిల్లా ఎస్పీ**

ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించనని నెల్లూరుజిల్లా ఎస్పీ ఎస్. సెంథిల్‌కుమార్ పోలీసులకు సూచించారు. మీ పనితనం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. సోమవారం జరిగిన సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మాట్లాడుతూ ఇంటి దొంగతనాలు జరుగుతున్నాయంటే గస్తీ సక్రమంగా లేదని, పనితీరు బాగాలేదన్న విషయం అర్థమవుతుందన్నారు. జిల్లాలో అంతర్‌రాష్ట్ర దొంగలముఠా తిష్టవేసిందని తెలిపారు. వారి కదలికలను పసిగట్టలేకపోవడం పనితీరుకు నిదర్శన మన్నారు. సిసిఎస్ పోలీసులు ఉన్నా లేనట్లుగా ఉందని, పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. ఉదయగిరి కేంద్రంగా ఎర్రచందనం అక్రమరవాణా యధేచ్ఛగా సాగుతున్నా కేవలం నామమాత్రంగానే కేసులు నమోదు చేస్తున్నారని, వాటికి సంబంధించిన ప్రధాన అనుచరులను అదుపులోకి తీసుకున్న పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హాస్టళ్ళలో సమస్యలను తీర్చండి

జిల్లాలోని బిసి సంక్షేమ బాలబాలికల వసతి గృహాల్లో మౌళిక సదుపాయాలు సక్రమంగా వుండడం లేదని, విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను రాష్ట్ర బిసి స్టూడెంట్‌ఫోరమ్ అధ్యక్షులు లీలాకృష్ణయాదవ్ కోరారు. ఆ మేరకు అసెంబ్లీలో చర్చించి, బిసి విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించారు. బిసిల వసతిగృహాలు అనేకం ఏళ్ళ తరబడి అద్దె ఇళ్లలోనే వుంటున్నాయని, ఇరుకు గదుల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు ఎన్నో అవస్తలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, తాము విద్యార్థుల వసతి గృహాలను సందర్శించి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణయాదవ్, కేశవనారాయణ, లక్ష్మణ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు రుణ సదుపాయం

నెల్లూరుజిల్లాలోని చిన్న, మధ్య తరగతి పరిశ్రమల స్థాపనకు అవసరమైన చేయూతనందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రుణసదుపాయం కల్పిస్తున్నట్లు ఎపిఎస్ఎఫ్‌సి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంస్థ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన సామర్థ్యాన్ని బట్టి రూ. 25లక్షల నుంచి రూ. 20కోట్ల వరకు రుణసదుపాయం కల్పిస్తామ న్నారు. పరిశ్రమలు, మార్కెట్ అవుట్‌లెట్‌లు, నర్సింగ్‌హోంలు, రెస్టారెంట్లు, హోటళ్ళు, ఫంక్షన్‌హాళ్లు తదితర సంస్థల ఏర్పాటుకు సత్వర రుణసదుపాయం ఉంటుందన్నారు.

# అవినీతి రహిత సమాజమే ధ్యేయం

**ఏసిబి అధికారులు**

అవినీతి రహిత సమాజ స్థాపనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, అవినీతి రహిత సమాజమే అందరి ధ్యేయం కావాలని ఏసిబి అధికారులు పిలుపునిచ్చారు.

బుధవారం అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా ఎసిబి ఎన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శివకుమార్‌రెడ్డి, కృపానందం తదితరులు పాల్గొని, వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవినీతిపరుల భరతం పట్టేందుకు పటిష్టమైన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై నిఘా పెట్టామన్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా 8 కేసుల్లో మొత్తం పదిమందిని అరెస్ట్ చేశామన్నారు. నలుగురు ఉద్యోగులను ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందన్నారు. అక్రమాలకు పాల్పడే అధికారులతో పాటు, ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన వ్యక్తులు, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నవారి వివరాలు ఏమైనావుంటే, ఆ సమాచారం తమకు అందిస్తే, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నవారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతి నిర్మూలనపై అవగాహన తరగతులు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ నెల 9వ తేది ఉదయం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి మైదానం వరకు ర్యాలీ, ఆ తర్వాత సమావేశం నిర్వహిస్తామని వారు వివరించారు.



ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన టిడిపి సాంస్కృతిక సంబరాలలో "ఏకపాత్రాభినయం" పోటీల్లో పాల్గొని బహుమతి అందుకుంటున్న న్యాయవాది, కవి ఇసనాక దయాకరరెడ్డి

# సిఐల బదిలీలు

జిల్లాలో భారీగా సిఐల బదిలీలు జరిగాయి. విఆర్‌లో వున్న టి.విజయ కృష్ణను సూళ్లూరుపేట సిఐగా, విఆర్‌లో వున్న కొండా శ్రీనివాసరావును వెంకటగిరి సిఐగా, ఒంగోలు ఎస్పీ ఆఫీసులో వున్న జె.శ్రీనివాసరావును ఉదయగిరి సిఐగా, నెల్లూరు ఐదో నగర సిఐ ఎస్.వి.రాజ శేఖరరెడ్డిని కలిగిరి సిఐగా, విఆర్‌లో వున్న వై.శ్రీనివాసరావును నెల్లూరురూరల్ సిఐగా, ప్రకాశం జిల్లా కందుకూరులో వున్న ఎం.మధుబాబును కావలిరూరల్ సిఐగా బదిలీ చేశారు. అలాగే నెల్లూరు సిసిఎస్‌లో వున్న ఐ.వెంకటేశ్వర్లును బుచ్చిరెడ్డిపాళెం సిఐగా, విఆర్‌లో వున్న పి.శ్రీనివాసరెడ్డిని పొదలకూరు సిఐగా, కృష్ణపట్నంపోర్టు సిఐ జి.వెంకటేశ్వర్లును నెల్లూరు 1వ నగర సిఐగా, సూళ్లూరుపేట సిఐ ఎం.రత్తయ్యను నెల్లూరు 3వ నగర సిఐగా, విఆర్‌లో వున్న మాణిక్యాలరావును నెల్లూరు 4వ నగర సిఐగా, నెల్లూరు సౌత్‌ట్రాఫిక్ సిఐ పి.సుబ్బారావును నెల్లూరు 5వ నగర సిఐగా, నెల్లూరు సిసిఎస్‌లో వున్న ఎస్.కె.బాజీజాన్‌సైదాను బాలాజీనగర్ సిఐగా, బాలాజీనగర్‌లో వున్న మంగారావును, కావలి 2టౌన్ సిఐగా, విఆర్‌లో వున్న ఎన్.వెంకటరావును కావలి 1టౌన్‌సిఐగా, మాచర్లలో వున్న టి.దిలిప్‌కుమార్‌ను గూడూరు రూరల్ సిఐగా, వెస్ట్ ట్రాఫిక్‌లో వున్న పి.బాలాజీని విఆర్‌కు బదిలీ చేశారు.

# వైకల్యాన్ని.. శాపం కానివ్వం



ప్రపంచ 55వ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీ పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో పొదలకూరురోడ్ నందు గల పెన్నా రచయితల కార్యాలయం నందు ప్రముఖకవి మోపూరు పెంచలనరసింహం రచించిన "వెలుగుపూలు గేయమాలిక" ఆడియో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు సూర్య షంషుద్దీన్, ఎస్‌జిఎస్ యూత్ అధ్యక్షులు షేక్ మస్తాన్, తేజశ్వి హైస్కూల్ కరస్పాండెంట్ జి.కృష్ణప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు అయూబ్, స్వప్న, మనోరమ, విశాలి, సుమన, శఇరీష, నీలోఫర్, మాలిని, విజయలలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం పెరసం అధ్యక్షులు షంషుద్దీన్ మాట్లాడుతూ అంగవైకల్యం శారీరకంగా లోపమే గాని మానసికంగా కాదని అంటూ అన్నీ వుండి వాటిని ఉపయోగించని వారు నిజమైన అంగవైకల్యులని అన్నారు. మోపూరు పెంచల నరసింహం మాట్లాడుతూ అందరినీ ప్రేమగా చూడాలని, వైకల్యం వారి తప్పుకాదని, సమాజం వారిపట్ల ప్రేమను చూపాలని అన్నారు.

చివరగా ఆయన రచించిన వెలుగుపూలు గేయమాలికను షంషుద్దీన్ ఆవిష్కరించారు.

# ఘనంగా నేవీడే



నెల్లూరు భక్తవత్సలనగర్ కెఎన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల 10 ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సిసి థర్డ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో 4వ తేదీ ఉదయం ఎన్‌సిసి కేడెట్లు నౌకాదళ(నేవీడే) దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక సేవలో భాగంగా పాఠశాలకు ఉత్తరదిక్కున గల నిర్మల్ హృదయ్ ఆశ్రమం ప్రహరీగోడ రోడ్డు ప్రక్కన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రపరిచారు. ఈ సందర్భంగా థర్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎన్‌సిసి కేడెట్లు చిన్నతనం నుండే సేవాభావాన్ని, దేశభక్తిని, సత్ప్రవర్తనను, క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఉద్బోధించారు. పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో భారతదేశం పాకిస్థాన్ నౌకాదళంపై సాధించిన ఘనవిజయానికి చిహ్నంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవాన్ని ఘనంగా జరుపుతారని వివరించారు.

# 'జపాన్' సిరులు

(మొదటిపేజీ తరువాయి)

పలు జపాన్ పరిశ్రమలున్నాయి. వాటి పురోభివృద్ధి బాగానే వుంది. ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. ఏపిలో పెట్టుబడులకు ముందుకొచ్చిన పలు జపాన్ కంపెనీలు, అందుకు నెల్లూరుజిల్లానే వేదికగా చేసుకుంటున్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికే ఆసక్తి చూపుతున్నాయి. జపాన్ కంపెనీలు నెల్లూరువైపే మొగ్గు చూపడానికి అనేక కారణాలున్నాయి. జిల్లాలో అతిపెద్ద కృష్ణపట్నంపోర్టు వుంది. రాష్ట్రంలోని మిగిలిన పోర్టులతో పోలిస్తే కృష్ణపట్నంపోర్టు నుండి జపాన్‌కు ప్రయాణకాలం తగ్గుతుంది. కృష్ణపట్నం ప్రైవేట్ పోర్టు. ఇక్కడ ఆధునిక వసతులున్నాయి. సర్వీస్ బాగుంటుంది. భూసేకరణ సులభంగా జరుగుతుంది. ఇతర పోర్టులతో పోలిస్తే తక్కువ రేటుకే భూమి లభిస్తుంది. ఇక 180కిలోమీటర్ల దూరంలో చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. జపాన్‌కు నేరుగా రాకపోకలు సాగించవచ్చు. జాతీయ రహదారి కనెక్టివిటి వుంది. జపాన్ పారిశ్రామిక వేత్తల అభిరుచికి తగ్గట్లుగా కృష్ణపట్నం పోర్టులోనే కోట్లాది రూపాయల ఖర్చుతో గోల్ఫ్‌కోర్సు నిర్మించబోతున్నారు. కృష్ణపట్నం పోర్టు సెజ్‌లో మిషనరీ తక్కువ, కార్మికులు ఎక్కువ వుండే పరిశ్రమలే రానున్నట్లు సమాచారం. ఇక్కడ తక్కువ వేతనాలకు కార్మికులు దొరుకుతారు.

ఆల్‌రెడీ శ్రీసిటి సెజ్‌తో జపాన్ పరిశ్రమలు నెల్లూరు జిల్లాకు రావడానికి ఒక మార్గం ఏర్పడింది. అదే మార్గంలో భారీ ఎత్తున జపాన్ కంపెనీలు రాబోతున్నాయి. కృష్ణపట్నంపోర్టు ఆధారంగా జరుగనున్న పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే కేంద్రం నెల్లూరును స్మార్ట్‌సిటీల జాబితాలో చేర్చింది.

# జగన్ అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

వైకాపాను నిలబెట్టడం కష్టమని గ్రహించిన జగన్ ఆ దిశగా ప్రయత్నం మొదలు పెట్టాడు. అధికారపార్టీ వైఫల్యాలపై ఇక ప్రజల్లోకి బలంగా దూసుకెళ్లడం ద్వారా పార్టీ కేడర్‌లో పార్టీ మారాలనే ఆలోచనే రానీయకూడదనుకుంటున్నాడు. అంతేకాక వైకాపా నిలుస్తుందా? పోతుందా? అన్న సందేహాలకు తెరదించేలా ప్రతిపక్ష వైకాపాను పటిష్టం చేసేదిశగా జగన్ అడుగులు వేస్తున్నారు.

# ఇది 'దోమల సిటీ'

(5వ పేజీ తరువాయి)

తదితర వ్యాధులకు గురైనవారితో చిన్న పిల్లల ఆసుపత్రులు కిటకిటలాడుతూనే వున్నాయి. వేలకు వేలు ఖర్చు చేసినా తగ్గని ఈ వ్యాధులతో, రోగాల తీవ్రత పెరిగిపోయి, ఇక చివరినిమిషంలో ప్రాణ భయంతో చెన్నై వంటి దూరప్రాంతాలకు తరలిపోయి చికిత్సలు చేయించుకుంటున్న బాధితులు అనేకమంది వున్నారు. పరిస్థితి ఇంత దయనీయంగా వున్నా ఎవరికి వారు తమకేమీ పట్టనట్లు వుంటున్నారే తప్ప, ఆచరణలో ప్రజల బాధలు తీర్చే నాధులు కన్పించడం లేదు.

**సమీక్షలు.. సమావేశాలతోనే కాలయాపన :**

ప్రజలు నిత్యం ఇన్ని బాధలు పడుతూనే వున్నా సంబంధిత అధికారులు, నాయకులు మాత్రం నిత్యం ఏవేవో సమీక్షలు, సమావేశాలతో కాలయాపన చేస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పట్టించుకోవడం లేదు. నగరంలోని అన్ని రకాల ఆసుపత్రులను సందర్శిస్తే డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులతో ఎంతెంతమంది రోగులు అవస్తలు పడుతున్నారో తెలుస్తుంది తప్ప, కిందిస్థాయి సిబ్బంది ఇచ్చే అంకెల గారడీతో వచ్చే నివేదికలు చూసి ప్రయోజనం లేదు. నిరుపేద వ్యాధిగ్రస్తులు ఆసుపత్రుల్లో ఎంతగా యాతన పడుతున్నారో ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. అదేవిధంగా, ఏఏ వీధులు మురుగుగుంటలుగా మారాయో, ఎక్కడెక్కడ చెత్తకుప్పలు రోజుల తరబడి నిల్వవుండి ఆ ప్రాంతమంతా దుర్వాసన కొడుతోందో... ప్రత్యక్షంగా వీక్షిస్తే తప్ప, వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అర్థంకాదు. అందుకు అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరం.

నగరంలో పేరుకుపోతున్న చెత్త కుప్పలను రోజువారీ ఎత్తివేసి పరిశుభ్రం చేసేందుకు నగరపాలక సంస్థ ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన ఒక క్రమబద్ధమైన ప్రణాళికను రూపొందించి పటిష్టంగా అమలు చేస్తే తప్ప ఈ పరిస్థితి ఒక కొలిక్కి రాదు. అందుకు ప్రజాప్రతినిధులతో కలసి అధికార బృందాలు ఏర్పడాలి. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించి, మురుగు కూపాల నివారణకు అప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. లేకుంటే, నగరం మరింతగా గబ్బుపట్టిపోతుంది. నగరం మురికి కూపంగా, అనారోగ్యకేంద్రంగా మారుతున్నా, ఎంతోమంది ప్రజలు నిత్యం నానా రకాల రోగాల బారిన పడు తున్నా... ఎవరికి వారు ముక్కు మూసుకుని వెళ్ళిపోవడం న్యాయమేనా?.. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా నేతలందరూ ఆలోచించి, నగరం పరిశుభ్రంగా వుండేందుకు వెంటనే అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. నగరాన్ని సుందర నందన వనంగా తీర్చిదిద్దేందుకు అందరూ సత్వరం సమాయత్తం కావాలి.

# హామీలన్నీ మాఫీ!

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాలు కుంటుపడ్డాయి. రైతులంటేనే బ్యాంకులు ఋణాలివ్వడం లేదు. ఋణమాఫీపై ప్రభుత్వం నుండి స్పష్టత లేకపోవడంతో బ్యాంకులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా డ్వాక్రా మహిళల ఋణాలను మాపీ చేస్తానన్న చంద్రబాబు ఇప్పుడు నాలుక మడతపెట్టాడు. బంగారు ఋణాలది కూడా అదే పరిస్థితి.

అసలు చంద్రబాబు ఈ ఋణమాఫీ తలనొప్పిని నెత్తిన పెట్టుకోకుంటే రాష్ట్ర ఆర్థికవ్యవస్థ కొంత సవ్యంగానే ఉండేది. బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్న రైతులు పద్ధతిగా కడుతుండేవాళ్లు. 2004 నుండి చూస్తే రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి ఆశాజనకంగానే వుంది. కరువు, వరదలు వంటి నష్టాలు తక్కువ. అప్పు తీసుకుని పంటలు పండించుకుని, పంట డబ్బు చేతికి రాగానే తిరిగి బ్యాంకులకు కడుతుండేవాళ్లు. నాలుగేళ్ల క్రితం యూపిఏ ప్రభుత్వం ఋణమాఫీ చేసింది. దాంతో బ్యాంకుల్లో ఋణాలు తీసుకుంటే తర్వాత ఏదో ఒక ప్రభుత్వం వచ్చి మాఫీ చేస్తుందనే ఫోబియా పెరిగింది. అంతేగాక ప్రైవేట్ అప్పులుతో పోలిస్తే బ్యాంకుల్లో వడ్డీ రేటు తక్కువ. కాబట్టి రైతుల కంటే రైతుల ముసుగులో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఇతరులు కూడా ఎక్కువగా అప్పులు తీసుకున్నారు. రాజకీయ నాయకులైతే ఇంకా ఎక్కువమంది ఉన్నారు. ఇప్పుడు ఋణమాఫీతో రైతులకంటే ఎక్కువగా లబ్ది పొందుతున్నదని ఇతర వర్గాలవారే!

ఋణమాఫీ వాగ్దానం రైతులను అటు ఉట్టికి ఇటు స్వర్గానికి కాకుండా చేసింది. రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ఇదో నిప్పులకుంపటిలా మారింది. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధిని పెంచేదిశగా చంద్రబాబు పాలనా విధానాలు లేవు. ఎన్నికలలో అలవిగాని హామీలు చేసివున్నాడు. ఇప్పుడు వాటి అమలు చేయాలంటే భారం తడిసి మోపెడవుతుంది. ఇచ్చిన హామీలనే మాఫీ చేసే పనికి శ్రీకారం చుట్టింది ప్రభుత్వం.

# కలెక్టర్‌ను అబ్బురపరచిన నెల్లూరు వింతలు

గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు మహా నగరం. జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ వద్ద సందడిగా వుంది. జిల్లా కొత్త కలెక్టర్‌గా జానకి అప్పుడే బాధ్యతలు తీసుకుంది. జిల్లాలోని అధికారులంతా వచ్చి ఆమెకు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి పోయారు. అందరినీ కలుసుకోడం అయిపోయాక ఆమెకు నెల్లూరు నగరాన్ని చూడాలనే కోరిక కలిగింది. నెల్లూరుకు కొత్త కాబట్టి, ఆల్‌రెడీ ఇక్కడే వున్న జాయింట్‌కలెక్టర్ రేఖారాణిని పిలిపించుకుంది. జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన ఎస్పీ సెంథిల్‌కుమార్ కూడా వారికి తోడుగా నగర పర్యటనకు బయలుదేరారు.

మొదట ఏదన్నా గుడికి పోదామని జానకి అడగడంతో అందరూ రాజరాజేశ్వరమ్మ గుడికి వెళ్లారు. కలెక్టర్ అక్కడ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అయ్యప్పగుడిని కూడా చూసుకుని మినీబైపాస్‌రోడ్డు మీదుగా అన్నమయ్యసర్కిల్ వద్ద కొచ్చారు. అక్కడ జనం గుమికూడి ఉండడంతో ఏంటబ్బా అని ఆగారు. అక్కడ మాటల మిసైల్, గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన చిట్టూ జనం ఉన్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇక్కడ నుండి ఇస్కాన్ గుడి దాకా 40అడుగులంట... అక్కడ నుండి 60అడుగులంట.. ఇదేం మాస్టర్‌ప్లాన్... ఇదెక్కడి అన్యాయం. రోడ్డన్నాక ఎక్కడైనా ఒకటే కొలత ఉండాలిగా.. దీనికి కారణం గత పాలకులే. పేదల గుడిసెల వద్ద మాత్రం 60అడుగులు ఇచ్చి, కాంగ్రెస్ నేతల స్థలాల వద్ద మాత్రం 40అడుగులే ఇచ్చారు. ఈ అన్యాయాన్ని ఖండిద్దాం అని ఆయన చెబుతున్నాడు. అది విని కలెక్టర్ జానకి ఆశ్చర్యపోయి.. అదేంటి ఒకే రహదారిలో రెండురకాల కొలతలు ఇస్తూ మాస్టర్‌ప్లాన్ తయారు చేయడమేంటని అడిగింది. దానికి రేఖారాణి.. నెల్లూరు మాస్టర్‌ప్లాన్ గురించి ఒకే ఒక్క మాస్టర్‌మైండ్‌కు తెలుసు, పదడంటూ ఏ.సి. సెంటర్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఆనం కాంగ్రెస్ కార్యాలయం ముందు ట్రంకు రోడ్డులోని వ్యాపారస్థులందరూ ఉన్నారు. అప్పుడే అక్కడ నల్లటి రేంజ్‌రోవర్ కారు వచ్చింది. అందులో నుండి కళ్ళకు నల్లద్దాలు పెట్టి, పెద్ద పంచెకట్టుతో స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(64) దిగాడు. ఆయనను చూడగానే ఓ వ్యాపారి కాళ్ల మీద పడి... మహాప్రభో మమ్మల్ని మీరే రక్షించాలి, మాస్టర్‌ప్లాన్ ప్రకారం ట్రంకురోడ్డును వెడల్పు చేస్తామని కమిషనర్ చక్రధర్‌బాబు గంటకోసారి చెబుతున్నాడు. మా గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ ఉపద్రవం నుండి మమ్మల్ని మీరే కాపాడాలి. ఆ మాస్టర్‌ప్లాన్ మా కొంపలకు ఎసరుపెడుతుందని మొత్తుకున్నాడు. అప్పుడు వివేకా కృష్ణుడి లెవల్లో భగవద్గీతలోని ఓ శ్లోకాన్ని చదివి... ఓ వ్యాపారస్తుడా... లెమ్మ... రోడ్డును వెడల్పు చేయడానికి వాళ్లెవరు? షాపు పోగొట్టుకోవడానికి నువ్వెవరు? ఈ నెల్లూరు సమస్తం నేనే ఉన్నాను... అతుకులు పడిన సిమెంట్‌రోడ్లలో, డ్రైనేజీ కాలువల్లో, మంచినీటి పైప్ లైన్లలో, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో, కూల్చిన భవనాలలో, నెల్లూరు నిండా కట్టిన అపార్ట్‌మెంట్లలో... ఇలా ఎక్కడ చూసినా నేనే కనిపిస్తాను, మాస్టర్‌ప్లాన్ ఇవ్వడానికి వాళ్లెవరు? మీ కొంపలు కూల్చడానికి వీళ్లెవరు? మాస్టర్ ప్లాన్ ఇచ్చింది నేనే... దానిని ఆపేందుకు పోరాడేది నేనే. 60 అడుగుల రోడ్లను 120అడుగుల రోడ్లు చేసేది నేనే... 120అడుగుల రోడ్లను 60అడుగులరోడ్లుగా మార్చేది నేనే... ఈ సమస్తం నెల్లూరు నా చుట్టూ తిరుగుతుండాలి... లేదంటే నేనన్నా నెల్లూరు చుట్టూ తిరుగుతుంటాను, నీకొచ్చిన భయమేమీ లేదు, ఈ ప్రభుత్వం వద్ద మాటలు తప్పితే చేతలు లేవు, నువ్వెళ్లి నీ వ్యాపారాన్ని నువ్వు శుభ్రంగా చేసుకో... పో అని ఆదేశించాడు. ఆ సమయంలో వ్యాపారస్తులకు వివేకా... అర్జునుడికి గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడు మాదిరిగా కనిపించాడు. అక్కడ సీనంతా చూసి కలెక్టర్ జానకి ఆశ్చర్యపోయి... అదేంటి ఆయనలా మాట్లాడుతున్నాడని అడిగింది. జేసీ రేఖారాణి... ఆయనో వైరైటీ మనిషి, సమస్యలు ఆయనే సృష్టిస్తాడు, ఆ సమస్యలను పరిష్కరించాలని మనల్ని సతాయిస్తుంటాడు. లక్కీగా మనం ఈ జిల్లాకొచ్చేసరికి ఆయన చేతిలో పవర్ లేదు కాబట్టి హ్యాపీగా ఉన్నామని అంది. తర్వాత ముగ్గురూ అక్కడనుండి కదిలారు. నెల్లూరు స్పెషల్ అంటూ ఎస్పీ సెంథిల్ కుమార్ కలెక్టర్‌కు నాలుగు అండర్‌బ్రిడ్జిలు చూపించాడు. వీటి ప్రత్యేకత ఏంటని జానకి అడిగింది. ఎండాకాలంలో ఇవి వాహనాల రాకపోకలకు ఉపయోగపడుతుంటాయి. వర్షాకాలంలో వీటిలో చేపల సాగు చేస్తారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఈ చేపలను వేలం వేస్తూ వచ్చిన ఆదాయాన్ని నగరాభివృద్ధికి ఖర్చుపెడుతుంటుందని సెంథిల్‌కుమార్ చెప్పారు. అక్కడనుండి గాంధీబొమ్మ వద్దకు వచ్చారు. అక్కడ గుట్టలుగుట్టలుగా వున్న ఆటాలోను చూసి కలెక్టర్... ఆటోవాలాలు సమ్మెకు దిగినట్లున్నారు, సిటీలోవున్న ఆటోలన్నీ ఇక్కడికే వచ్చాయని అంది. దానికి ఎస్పీ... ఆటోవాలాలు సమ్మె చేయడం లేదు మేడమ్, వాళ్లు సమ్మె చేసారంటే ఆటోలన్నీ పెట్టడానికి నెల్లూరు చెరువు కూడా సరిపోదు. మామూలుగానే ఎప్పుడూ ఇన్ని ఆటోలు ఇక్కడ ఉంటూనే ఉంటాయి. ఆత్మకూరు బస్టాండ్ నుండి అయ్యప్పగుడి దాకా ఎప్పుడు చూసినా ఆటోల ర్యాలీ జరుగుతున్నట్లుగానే ఉంటుందని చెప్పాడు. నెల్లూరు రంగనాథస్వామి గురించి కలెక్టర్ జానకి ఇంతకుముందే విని వుండడంతో అక్కడకు పోదామని అడిగింది. ముగ్గురూ అక్కడకు వెళ్లారు. గుడిలోకి వెళ్లారు. రంగనాయకుల స్వామి ఒంటరిగా పడుకుని దిగులుతో వున్నట్లనిపించింది. భక్తుల కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లుగా దేవాలయం నిర్మానుష్యంగా వుంది. జానకి ఆశ్చర్యంగా... ఇదేంటి, ఇంత చారిత్రక ప్రాధాన్యంగల గుడిలో భక్తులే లేరని అడిగింది. అందుకు జేసీ రేఖారాణి... ఇంత ప్రశాంతంగా, ఇంత విశాలంగా వున్న గుడులంటే నెల్లూరు జనాలకు ఆసక్తి వుండదు మేడమ్, వాళ్లకు గుడులు చాలా ఇరుకుగా వుండాలి. అవికూడా మెయిన్‌రోడ్డును అనుకుని ఐదు లేదా పది అంకణాల స్థలంలో ఉంటే చాలు. బైక్‌ల మీద, కార్లలో పోతూపోతూ అక్కడ ఒక్క సెకండ్ ఆగి ఏదో ఫార్మాలిటీగా దండం పెట్టుకునేటట్లు గుడులుండాలి. నెల్లూరులో అలాంటి గుడుల వద్దే భక్తుల తాకిడి ఎక్కువుగా ఉంటుంది. అంతేకాక హైవే మధ్యలో, రెండు రైల్వేట్రాక్‌ల మధ్యలో వుండే మందిరాలంటే ఎనలేని క్రేజ్ అని చెప్పింది. గుడి ప్రాంగణంలో నుండీ పెన్నా మీద కడుతున్న బ్యారేజ్ కనిపించసాగింది. అదేంటని కలెక్టర్ అడిగింది. అది పెన్నానది మీద కడుతున్న బ్యారేజీ... క్రీస్తుశకం ఆనం వివేకానందరెడ్డి హయాంలో దానిని మొదలు పెట్టారు. ఎవరి హయాంలో పూర్తవుతుందో చెప్పలేమని రేఖారాణి అంది. అక్కడనుండి పొగతోటకు చేరుకున్నారు. దాదాపు పది ఆసుపత్రులదాకా కలెక్టర్ పరిశీలించింది. అన్ని ఆసుపత్రులలో ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని ఆమె పసిగట్టింది. ప్రతి ఆసుపత్రిలోనూ దేవుడిపటాల మధ్యలో 'దోమ' ఫోటో కూడా వుండడం. దానికి కూడా పూజలు చేసి ఉండడాన్ని గమనించింది. ఆ విషయాన్నే జేసీ, ఎస్పీలతో ప్రస్తావిస్తూ... నేను గోవులను పూజించడం చూసాను, ఇంకా కొందరు పక్షులు, చెట్లను పూజిస్తుంటారు, కాని ఇక్కడ ఆసుపత్రులలో ఏంటీ దోమల ఫోటోలు పెట్టి పూజిస్తున్నారని అడిగింది. అందుకు రేఖారాణి... ఇక్కడ డాక్టర్ల పాలిట దోమలే దైవం. నెల్లూరులో వేలసంఖ్యలో ఆసుపత్రులున్నా ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతుంటాయంటే ఆ దోమలే కారణం. ఆ దోమలు నెల్లూరు జనాలను రాచిరంపాన పెడుతుండబట్టే డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వాటితో పాటు అనేక రోగాలు వస్తున్నాయి. వాళ్లంతా ఆసుపత్రులకు పరుగులుతీస్తుంటారు. ఇక్కడ ఆసుపత్రులు, ల్యాబ్‌లు మనుగడసాగిస్తున్నాయంటే అది దోమల పుణ్యమే. కాబట్టే దోమలను పూజిస్తుంటారని చెప్పి, ఇక మనం కూడా ఇళ్లకు బయల్దేరాల్సిన సమయం ఆసన్నమైంది... చీకటి పడుతుంది. ముదురుదోమలు రోడ్ల మీదకొచ్చే టైమయ్యింది. లేదంటే రేపు ఈ ఆసుపత్రులకు ఇంకో పరిస్థితిలో రావాల్సివస్తుందని చెప్పడంతో ముగ్గురూ ఎవరిళ్లకు వాళ్లు బయల్దేరారు.

## మూలాపేట హుండీ రాబడి

నెల్లూరు, మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం హుండీని మంగళవారం లెక్కించారు. కార్తీకమాసంలో హుండీ ద్వారా 15,51,971 రూపాయల ఆదాయం లభించింది. గత ఏడాది కార్తీకమాసంలో కన్నా ఈ ఏడాది హుండీ ద్వారా 3.42లక్షల రాబడి పెరిగింది.

## త్యాగరాజ ఉత్సవాలకు భిక్షాటన

భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో నిర్వహించనున్న త్యాగరాజ ఉత్సవాల నిర్వహణకు నెల్లూరు నగరంలో భిక్షాటన సాగింది. ఆదివారం ఉదయం నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఆదిత్యానగర్‌లో సంగీత విద్వాంసుల భిక్షాటన జరిగింది. స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ భిక్షాటనను సాగించారు. గత 49సంవత్సరాలుగా జరుగుతున్న ఈ కార్యక్రమాలు ఈ ఏడాది స్వర్ణోత్సవాలను జరుపుకోనుందని కార్యదర్శి నాగదేవీ ప్రసాద్ తెలిపారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

కాలభైరవ అష్టమి సందర్భంగా శనివారం నగరంలోని మూలాపేట శివాలయంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## కలెక్టర్ జానకికి సువర్ణాక్షరాలతో స్వాగతం

నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎం.జానకికి వినూత్నంగా స్వాగతం పలికారు నెల్లూరు జెండా వీధికి చెందిన సూక్ష్మ నమూనాల కళాకారుడు షేక్‌ముసవ్విర్. బంగారు అక్షరాలతో అతిసూక్ష్మంగా కలెక్టర్ పేరును రూపొందించి కంటిరెప్పలో ఉంచి ప్రదర్శించారు. కేవలం వందమిల్లీగ్రాముల బంగారంతో ఒక్క సెంటీమీటర్ పొడవు, 7సెంటీమీటర్ల ఎత్తులో ఒక్కరోజు కష్టపడి నమూనా తయారు చేశారు.



## గురజాడ శతవర్ధంతి

నవయుగ వైతాళికులు గురజాడ అప్పారావు శతవర్ధంతి కార్యక్రమాన్ని కావలిలో ఆదివారం తెలుగుభాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షులు ఎస్.జయప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ భవనంలో గురజాడకు కావలికి చెందిన పలువురు సాహితీప్రియులు నివాళులర్పించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుని చాకలికొండ శారద గురజాడ రచనలపై ప్రసంగించారు. ఆయన రచనలు నిత్యం సమాజానికి ఉపయోగపడేవిగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కాళిదాసు విజయచంద్ర, గణపతి మారుతి, మద్దాళి సతీష్‌బాబు పాల్గొన్నారు.

## తాళ్ళపాక వంశీయులకు స్వాగతం

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య వంశంలో 12వ తరానికి చెందిన శ్రీ తాళ్ళపాక హరినారాయణాచార్యులకు సోమవారం నెల్లూరులో స్వాగతం పలికారు. శ్రీ వేంకట అన్నమాచార్య సేవామండలి నూతన కమిటి ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన హరి నారాయణాచార్యులకు నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి ఎస్‌బిఎస్ కళ్యాణ మండపం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవి, వినాయకుడు వంటి శ్రీహరి పరివారంతో మేళతాళాలు, భక్తసంకీర్తనలు, గోవిందనామస్మరణల నడుమ జరిగిన ఊరేగింపులో మహిళాభక్తులు దీపాలతో పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ మండపంలో విశేష అలంకారంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి పూజలు నిర్వహించారు.

## సత్యంజీ నీరు - చెట్టు



మనిషి జీవనానికి చెట్లు చాలా అవసరం. మనకు ప్రాణవాయువు అందిస్తూ మనల్ని ఆరోగ్యంగా వుంచేవి చెట్లే! దీనిని దృష్టిలో పెట్టుకునే సత్యంజీ గ్రూప్ వారు దాదాపు 2000 చెట్లను నాటారు. ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు గత 10వారాలుగా సత్యంజీ గ్రూప్ వారు 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే సత్యంజీ గ్రూప్ వారు 10వారాలుగా నాటిన చెట్లకు 2వ తేదీ నీరు పోసి, వాటి సంరక్షణను చూశారు.

# మార్క్-3 సన్నాహక ప్రయోగానికి భారీ ఏర్పాట్లు

## - షార్ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్

**శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం మరో భారీ ఉపగ్రహ వాహకనౌక ప్రయోగానికి ముందస్తు ప్రయోగం చేసేందుకు సమాయత్తమైంది. ఈ ఉపగ్రహ వాహకనౌక జీఎస్ఎల్వి మార్క్-3 సన్నాహక ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు షార్ శాస్త్రవేత్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఈ వాహకనౌక అంతరిక్ష పరిశోధనల్లో ఎంతో కీలకంగా మారుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.**

అత్యంత భారీ ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకువెళ్ళే జీఎస్ఎల్వి మార్క్-3 వాహకనౌక ప్రయోగాన్ని దిగ్విజయం చేసేందుకు శ్రీహరికోట శాస్త్రవేత్తలు నిరంతర కృషిలో వున్నారు. ఈ నెల 15-20 తేదీల మధ్య ఈ వాహకనౌకను ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. నమూనా వ్యోమగాముల గదిని ఈ ప్రయోగం ద్వారా రోదసిలోకి పంపి పరిశీలన చేయనున్నారు. ఇది కేవలం పరిశీలనాత్మక ప్రయోగవే అయినా, ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సన్నాహక ప్రయోగ విజయానికి కృషి చేస్తున్నారు.



ఇది ప్రయోగాత్మక పరిశీలన మాత్రమేనని, వివిధ వ్యవస్థలను పరిశీలించిన అనంతరం, ఏడాదిలోగా పూర్తిస్థాయి వాహకనౌకను రూపొందిస్తామని ఇటీవల శ్రీహరికోటలో జరిగిన విలేకరుల సమావేశంలో షార్ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ తెలియజేశారు. శ్రీహరికోట ప్రయోగవేదిక నుంచే ఈ ప్రయోగం వుంటుందన్నారు. దాదాపు నాలుగు టన్నుల వరకు బరువు వున్న ఉపగ్రహాలను మార్క్-3 ద్వారా ప్రయోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్క్-3 వాహకనౌకలో క్రూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీఎంట్రీ ఎక్స్‌పెరిమెంట్ ఎంతో కీలకమైందని, దీనికోసం అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామని, ఇప్పుడు చేపట్టనున్న ప్రయోగంలో క్రూమాడ్యూల్‌లో వ్యోమగాములను పంపడం లేదని, అయితే భవిష్యత్తులో మానవ సహిత రాకెట్ ప్రయోగాలను ఇస్రో చేపట్టే అవకాశం వుందన్నారు. మార్క్-3 వాహక నౌక రూపకల్పనలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతో అభినందనీయమన్నారు. మార్క్-3 ప్రయోగం విజయవంతమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో షార్ డైరెక్టర్‌తో పాటు, అసోసియేట్ డైరెక్టర్ శేషగిరి రావు, ఎల్‌విఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ రాణా, వెహికల్ డైరెక్టర్ అయ్యప్పన్, మిషన్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ ఇతర విభాగాల డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఈ నెల 4వ తేదీ నెల్లూరు గోల్డెన్ జూబ్లీహాల్లో భూసేకరణపై రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి డా॥ పి.నారాయణ, పక్కన కలెక్టర్ ఎం.జానకి, జేసీ రేఖారాణి

## సింహపురి వేదికగా...

# 'తానా' వేడుక

త్వరలో అమెరికాలో నిర్వహించే ప్రవాస తెలుగు వారి పండుగ 'తానా' అంతర్జాతీయ వేడుకలను పురస్కరించుకుని నెల్లూరులో 'తానా' ప్రాంతీయ వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈ నెల 17, 18తేదీలలో ఈ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. అమెరికాలో ఉన్నప్పుడు 'తానా'లో ముఖ్యపాత్ర పోషించి, ప్రస్తుతం తడ సమీపంలో శ్రీసిటీ వంటి విజయవంతమైన పారిశ్రామికసెజ్‌ను నిర్వహిస్తూ అంతర్జాతీయంగా కీర్తిప్రతిష్టలు పొందిన రవి సన్నారెడ్డి చొరవ తీసుకుని ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల నిర్వహణకుగాను నెల్లూరులో పలువురు మేధావులు, విద్యావేత్తలు, అనుభవజ్ఞులతో కమిటీలు కూడా వేశారు.

తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నెల్లూరు రుచులు, అభిరుచులు ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించతలపెట్టారు. అంతరించిపోతున్న మన కళలు గంగిరెద్దులు, హరిదాసు, కోలాటం, పండరిభజన వంటి వాటితో పాటు సాంప్రదాయ ఆటలు, జానపద నృత్యాలు, వివిధ రకాల కళాప్రదర్శనలతో ఆరోజు నెల్లూరుప్రజలకు కనువిందు చేయనున్నారు. నెల్లూరులో జరిగే ప్రాంతీయ 'తానా' వేడుకల కోసం ప్రవాసభారతీయులు కూడా పెద్దసంఖ్యలో రానున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

# ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

## - వికలాంగుల దినోత్సవంలో జిల్లా కలెక్టర్



వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాల్లోనూ మరింతగా రాణించాలని జిల్లా కలెక్టర్ ఎం.జానకి ఆకాంక్షించారు. బుధవారం వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో వికలాంగుల దినోత్సవం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా వికలాంగులకు క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన వారికి బహుమతిప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. అంగవైకల్యంతో వున్నప్పటికీ వికలాంగులు అన్ని రంగాల్లోనూ ఎవరికీ తీసిపోనివిధంగా ముందంజలో వుంటున్నారని అన్నారు. వికలాంగులను అందరూ ఆదుకోవాలన్నారు. వికలాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వపరంగా వికలాంగులకు ఎంతో చేయూతనందిస్తున్నామని, అర్హులందరికీ పింఛన్లను పెంచి ఇచ్చేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. జడ్పీచైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, వికలాంగులకు తమవంతు సాయం అందిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా వికలాంగుల సాయం కోసం దాదాపు 10లక్షల రూపాయలను అందజేసేందుకు సిద్ధంగా వున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జడ్పీ నిధుల నుంచి 4.60 లక్షల రూపాయలను వెచ్చించి, వికలాంగులకు ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, వికలాంగులు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఆత్మస్థైర్యంతో క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వికలాంగుల క్రీడోత్సవా లను ప్రారంభించిన నగర మేయర్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు మాట్లాడుతూ వికలాంగుల పట్ల అందరూ సమభావం చూపాలన్నారు. పాఠశాలల్లో వీరికి రాయితీలు ఇచ్చి, వారి చదువులకు, ఎదుగుదలకు చేయూతనందించాలన్నారు.

ఈ క్రీడోత్సవాల్లో విశ్వభారతి అంధుల పాఠశాల, ప్రగతి ఛారిటీస్, మాగుంట సుబ్బరామిరెడ్డి స్పాస్టిక్ సెంటర్ మానసిక వికలాంగుల పాఠశాల, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ తదితర సంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏజెసి రాజ్‌కుమార్, వికలాంగుల సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాణి, రాజీవ్ విద్యామిషన్ పి.ఓ కోదండరామిరెడ్డి, కార్పొరేటర్ మేకల రజనిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రీడాదినోత్సవం

నెల్లూరు, పడారుపల్లి వికలాంగుల కాలనీలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వికలాంగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రీడా పోటీల విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాళ్ళపాక అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆచార్య ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.









Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com